



# క్రీడాకారుల ముప్పై ఏళ్ల కల సాకారం - శాప్ ఛైర్మన్



తిరుపతి క్రీడ, మే 2 ప్రభాతవార్త: క్రీడాకారుల ముప్పై ఏళ్ల కల సాకారం అయ్యిందని శాప్ చైర్మన్ రవినాయుడు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీలో క్రీడాకారులకు రాత పరీక్ష లేకుండా 3శాతం హారిజంటల్ రిజర్వేషన్ రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కల్పించారు. మెగా డీఎస్సీ లో భాగంగా స్పోర్ట్స్ కోటా కింద 421 ప్రభుత్వ పాఠశాల ఉద్యోగాలకు దరఖాస్తులు, మండల పరిషత్, జిల్లా పరిషత్, మున్సిపల్ కార్పొరేషన్, ఏపీ మోడల్, ఏపీ రెసిడెన్సియల్, ట్రైబల్, సోషల్ వెల్ఫేర్ విద్యాసంస్థల్లో ఉద్యోగాలు భర్తీ కానున్నదన్నారు. దరఖాస్తుల స్వీకరణకు వెబ్‌సైట్‌ను ఏపీ స్పోర్ట్స్ అథారిటీ ప్రారంభించారు. నేటి నుంచి మే 31వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణకు గడువు అన్నారు. క్రీడాకారులకు 10 గంటల నుంచి అందుబాటులో స్పోర్ట్స్.ఏపి.జిఒవి.ఇన్/స్పోర్ట్స్ డిఎస్సి.ఏపిసిఎఫ్ఎస్ఎస్ వెబ్‌సైట్లు సీనియర్ క్రీడా విభాగం మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు. జిల్లా స్థాయి స్క్రీనింగ్ కమిటీ, రాష్ట్ర స్థాయి ఫైనల్ కమిటీల ద్వారా తుది జాబితా ఆమోదం, క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

క్రీడాకారుల కలను సాకారం చేసిన నారా చంద్రబాబునాయుడుకి, నారా లోకేష్‌కి, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కి, మంత్రులకు శాప్ చైర్మన్ రవినాయుడు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలి

**-2047 స్వర్ణాంధ్ర లక్ష్యంగా నియోజకవర్గాల అభివృద్ధి - డీఆర్ నరసింహులు**




తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త : స్వర్ణాంధ్ర-2047 సాధనలో భాగంగా సీఎం విజనరీకి అనుగుణంగా నియోజకవర్గాల అభివృద్ధికోసం విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పన చేయాలని జిల్లా రెవిన్యూ అధికారి నరసింహులు అధికారులను ఆదేశించారు. పద్మావతి మహిళా వర్సిటీలోని సావేరి సెమినార్ హాల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులకు నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ రూపకల్పనపై శుక్రవారం వర్క్షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా వర్క్షాపు నుద్దేశించి ఆయన మాట్లాడుతూ నియోజక వర్గ ప్రత్యేక అధికారులు, టీం సభ్యులు,నియోజక వర్గం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్ళే విధంగా పథకాలు రూపొందించాలని సూచించారు.సరైన ప్రణాళికలను రూపొందించుకొని టీం వర్క్ పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని ఆదేశించారు.పీ4 విధానంలో భాగంగా బంగారు కుటుంబాలను అభివృద్ధి చేసేందుకు మార్గదర్శకాలను గుర్తించి, అట్టడుగు కుటుంబాలకు చేయూత కల్పించి అభివృద్ధివైపు నడిపించాలని సూచించారు.వర్క్ షాపు లో ఏపీ ప్రణాళిక శాఖ సంచాలకులు రావి రాంబాబు ప్రణాళికాశాఖ సీనియర్ సలహాదారు సీతాపతిరావు,సీపీఓ ప్రేమచంద్ర, తిరుపతి రెవిన్యూ డివిజనల్ అధికారి రామ్మోహన్, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల నుంచి నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల పరిషత్ అధికారులు, జిల్లా స్థాయి అన్ని శాఖాధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ ఘాతానికి గురై... జియో టెక్నీషియన్ మృతి!



విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందిన హిమగిరి

రేణిగుంట, మే 2 ప్రభాతవార్త : రేణిగుంట మండలం కరకంబాడి పంచాయతీ రాజీవ్ నగర్ ట్రాన్స్కొ విద్యుత్ ట్రాన్స్ఫార్మర్ వద్ద శుక్రవారం జియో కంపెనీ సెల్ టవర్ టెక్నీషియన్ హిమగిరి (26) విద్యుత్ ఘాతానికి గురై మృతి చెందాడు. స్టేషన్ రైటర్ గౌరీ నాయుడు కథనం మేరకు రేణిగుంట మండలం గురవరాజు పల్లి పంచాయతీ రామకృష్ణాపురం గ్రామానికి చెందిన హిమగిరి జియో సెల్ టవర్ టెక్నీషియన్ గా విధులు నిర్వహిస్తున్నాడు. కరకంబాడి పంచాయతీ రాజీవ్ గాంధీ సమీపంలోని జియోటవర్ పనిచేయడం లేదని జియో ఆఫీసు నుండి గురువారం రాత్రి హిమగిరికి సమాచారం వచ్చింది. విషయం తెలుసుకున్న అతను టవరు వద్దకు చేరుకున్నాడు. రాత్రి ఒంటిగంటకు జియో కంపెనీ సూపర్వైజర్ శివకుమార్ హిమగిరి అన్నకు ఫోన్ చేసి హిమగిరి ఫోన్ లిఫ్ట్ చేయడం లేదని చెప్పాడు. వెంటనే అతను రాజీవ్‌గాంధీ కాలనీ జియో సెల్ టవర్ వద్దకు కుటుంబ సభ్యులతో కలసి వెళ్లి చూడగా హిమగిరి విగత జీవుడై పడి ఉన్నాడు. జియో టవర్ సమీపంలోని ట్రాన్స్కొ ట్రాన్స్ఫార్మర్ వద్ద ఎలక్ట్రికల్ వైరును ఎడమ చేతితో హిమగిరి పట్టుకొని ఉండటం వలన ఫీజు వేయడానికి వెళ్లి విద్యుత్ షాక్కుగురై మృతి చెందినట్లు పోలీసులు ప్రాథమికంగా నిర్ధారించారు. అర్బన్ సీఐ జయచంద్ర ఆదేశాల మేరకు ఎస్సై అరుణ్ కుమార్ రెడ్డి పర్యవేక్షణలో పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

# నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు పక్కా ఏర్పాట్లు : కలెక్టర్



ఏర్పాట్లను పరీక్షా కేంద్రాల్లో ఎస్పీతో కలిసి పరిశీలిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, మే 2 ప్రభాతవార్త: నీట్-2025 ప్రవేశ పరీక్ష నిర్వహణకు పక్కాగ ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగర పరిధిలో నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహించే పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సావిత్రమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రాలను శుక్రవారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా నీట్-2025 ప్రవేశ పరీక్ష ఆదివారం జరుగనుందని, నీట్ ప్రవేశ పరీక్ష నిర్వహణకు చిత్తూరులోని పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 432 మంది అభ్యర్థులు, సావిత్రమ్మ మహిళా డిగ్రీ కళాశాల పరీక్షా కేంద్రంలో 278 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ఎంబిబిఎస్, బిడిఎస్, బిఎఎంఎస్, బిహెచ్ఎంఎస్ వంటి మెడికల్ గ్రాడ్యువేషన్ కోర్సుల్లో ప్రవేశాల కోసం ఎన్‌టిఏ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ) నిర్వహించే ఎన్ఇఇటి(నేషనల్ ఎలిజిబిలిటీ కమ్ ఎంట్రన్స్ టెస్ట్) పరీక్ష నిర్వహిస్తోందన్నారు. ఈ ప్రవేశ పరీక్ష ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందని, పరీక్షలను పక్కాగా నిర్వహించడానికి అన్ని ఏర్పాట్లు చేపట్టి పూర్తి చేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అలాగే ఎలాంటి పొరబాట్లకు తావివ్వకుండా పక్కాగా పరీక్షలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించి పూర్తి చేయాలని, పరీక్షా సమయంలో విద్యుత్‌కు అంతరాయం కలుగకుండా జనరేటర్లను సిద్ధం చేసి వుంచుకోవాలని, పరీక్షా కేంద్రాల వెలుపల తల్లిదండ్రులు వేచి వుండటానికి షామియానాలు, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలన్నారు. అలాగే పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాలు వుండాలని, విభిన్న ప్రతిభావంతులకు వీల్ ఛైర్లు అందుబాటులో వుంచాలని, పరీక్షా కేంద్రంలోకి ఇన్విజిలేటర్లు, విద్యార్థులు ఎవ్వరు సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకెళ్ళడానికి అనుమతి లేదని, సెల్ ఫోన్లను భద్రపరచడానికి ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతి పరీక్షా కేంద్రంలో రెవెన్యూ, పోలీసు శాఖల తరపున నియమించిన నోడల్ అధికారులు విధులు నిర్వహిస్తుంటారని, పరీక్షా కేంద్రాల్లో సిట్టింగ్ అరెంజ్‌మెంట్స్, లైట్లు, ఫ్యాన్లు వంటి ఏర్పాట్లను చేపట్టి పూర్తి చేయాలన్నారు. ఎస్పీ మణికంఠ చందోలు మాట్లాడుతూ ప్రశ్నాపత్రాలను ఆర్మ్‌డ్ పోలీసు బందోబస్తు ఎస్కార్ట్‌తో పరీక్షా కేంద్రాలకు తీసుకెళ్ళే సమయంలో పూర్తి స్థాయి వీడియో, ఫోటోగ్రఫీ చేయడం జరుగుతుందన్నారు. కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు పివికెఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సావిత్రమ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్ళు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## 6 నుంచి శివయ్యకు చిన్న కొటాయ్ ఉత్సవం
## మే 4 నుంచి శివయ్యకు ధారాపాత్ర



శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిర్వహించే ఉత్సవాలు, సేవలు భిన్నంగా ఉంటాయి. ఈ నేపథ్యంలో ఈనెల 6నుంచి12 స్వామి అమ్మవార్లకు చిన్న కొటాయ్ ఉత్సవం నిర్వహించబడుతుందని ఆలయ ఇఓ డి.బాపిరెడ్డి శుక్రవారం వివరించారు. ఆలయంలో స్వామి అమ్మ వార్లతో పాటు అనుబంధంగా ఉన్న పరివార దేవతలకు కూడా నిత్యం ఉత్సవాలు నిర్వహిస్తుంటారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయంలో పెద్ద కొటాయ్ ఉత్సవాలను పది రోజుల పాటు నిర్వహిస్తారు. వేసవిలో స్వామి అమ్మవార్లకు వారం రోజుల పాటు చిన్న కొటాయ్ ఉత్సవం నిర్వహిస్తారు.ఈ ఏడాది శోభాకృత్ నామ సంవత్సరం చిన్న కోటాయ్ ఉత్సవం ఈ నెల 6నుంచి 12వరకు నిర్వహించ బడుతుందన్నారు. సాయంత్రం ప్రతి రోజూ 5.30 గంటలకు ఈ ఉత్సవం నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నామని వివరించారు. స్వామి అమ్మ వార్లను అలంకార మండపంలో చక్కగా అలంకరించి గ్రామోత్సవంగా ఆలయ ఆవరణలోని పొగడ చెట్టు కిందకు తీసుకువస్తారు.అక్కడ వట్టివేళ్ళతో పందిళ్ళు, పరదాలు ఏర్పాటు చేస్తారు. అక్కడ స్వామి అమ్మవార్లకు సేవలందించి అభిషేకాలు, అనంతరం మూడు ప్రదక్షిణలు జరిపి దీపారాధన,హారతులు అందించి ఆలయానికి చేర్చబడుతుందన్నారు.మే 5న గ్రామోత్సవం నిర్వహి స్తామని ఆలయ ఇఓ వివరించారు.

**4 నుంచి డొల్లు కత్తెర :శివయ్యకు ధారా పాత్ర**

సంప్రదాయాలు,సంస్కతికి నిదర్శనమైన శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ నెల 4 నుంచి డొల్లు కత్తెర ప్రారంభం కానున్నట్లు ఆలయాధికారి బాపిరెడ్డి తెలిపారు. విశ్వవసు నామ సంవత్సరం వైశాఖ చిత్త శుద్ధి సప్తమి శుక్రవారం రాత్రి 12.23 గంటలకు డొల్లు కత్తిర ప్రారంభం కానున్నట్లు వివరించారు.ఈ సందర్భంగా వాయులింగేశ్వరుని మూల విరాట్టుకుపై భాగాన ధారా పాత్ర నెలకొల్ప బడుతుందని వివరించారు. ఇదే ప్రత్యేక తరహా అన్నారు. ఈ నెల 4న ఒరెండవ కాలాభిషేకం తరువాత దారా పాత్ర ఏర్పాటు చేస్తామన్నారు. ఈ నెల 11 నుంచి నిజ కత్తెర ప్రారంభమౌతుందన్నారు. ఈ నిజ కత్తెర మే నెల 28 వరకు కొనసాగుతుందన్నారు. 29న ఉదయం 7.14గంలకు కత్తెర త్యాగం జరుగుతుందని ఆలయ వివరించారు. ఈ సమయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

## అక్షయతృతీయ పర్వదినాన రికార్డు స్థాయిలో బంగారు డాలర్లు విక్రయాలు

**-రూ.90లక్షలపైగా టిటిడికి ఆదాయం**

ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:

అక్షయతృతీయ పర్వదినాన శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకున్న భక్తులు కొందరు సెంటిమెంట్‌గా బుధవారం తిరుమలలోనే బంగారుడాలర్లు కొనుగోలు చేశారు. డబ్బున్న ధనవంతులేగాక ఆర్థికస్థోమత ఉన్న భక్తులు కూడా బుధవారం రోజు సెంటిమెంట్‌గా శ్రీవారి ప్రతిమతో ఉన్న టిటిడి విక్రయించిన 2గ్రాములు, 5,10గ్రాముల విలువైన బంగారు డాలర్లు 186 భక్తులు కొనుగోలుచేయడం విశేషం. అలాగే వెండి 5,10గ్రాముల డాలర్లు కూడా 337 విక్రయాలు చేశారు. ఈ మొత్తం విక్రయాల ద్వారా టిటిడికి బుధవారం ఒక్కరోజే 90,70,667 రూపాయలు ఆదాయం రికార్డుస్థాయిలో చేకూరడం నమోదైంది. శ్రీవేంకటేశ్వర స్వామి ప్రతిమ డాలరు ధరిస్తే తమతోబాటే స్వామివారు ఉన్నట్లేనని భక్తులు విశ్వాసం వ్యక్తం చేస్తుంటారు. అక్షయతృతీయ పర్వదినంరోజు మాత్రం భక్తుల నుండి వచ్చే డిమాండ్‌కు తగ్గట్లు 2గ్రాముల బంగారుడాలర్లును అందుబాటులో ఉండేలా టిటిడి అదనపు ఈఓ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ప్రత్యేక చొరవ చూపారు.

**-అక్షయ తృతీయం రోజు అనూహ్యంగా అమ్మకాలు:**

దేశవ్యాప్తంగా ఉన్న హిందువులు,జైనులు అక్షయతృతీయ పర్వదినాన్ని బంగారు కొనుగోలుపై ఆసక్తి చూపు తుంటారు. ఏప్రిల్ 30వతేదీ బుధవారం అక్షయతృతీయ పర్వదినం కావడంతో తిరుమలలోనూ భక్తులు సెంటిమెంట్‌గా దేవునిచెంత కొంత బంగారు కొనుగోలుచేయడంపై ఆసక్తిచూపారనే తెలుస్తుంది. అందుకు తగ్గట్లు టిటిడి సేల్స్(విక్రయాల)కౌంటర్‌లో కూడా రికార్డుస్థాయిలో భక్తులు బంగారు, వెండి డాలర్లను కొనుగోలు చేశారు. బుధవారం ఒక్కరోజే (ఏప్రిల్ 30న) 2గ్రాముల బంగారు డాలర్లు 92 కొనుగోలు చేయగా 20,013రూపాయలు లెక్కన 18,41,196రూపాయలు ఆదాయం వచ్చింది. 5గ్రాముల బంగారు డాలర్లు 41 అమ్మకాలద్వారా ఒక్కొక్కటి 48,246రూపాయలు లెక్కన 19,78,086 రూపాయలు, 10గ్రాముల బంగారుడాలర్లు 53 అమ్మకాలు ఒక్కొక్కటి 93,349 రూపాయలు లెక్కన 49,47,497రూపాయలు ఆదాయం చేకూరిందని టిటిడి వర్గాల సమాచారం. ఇక 5,10గ్రాముల వెండి డాలర్లు 337 విక్రయాల ద్వారా 3,03,888లక్షల రూపాయలు ఆదాయం చేకూరింది. నిన్నఒక్కరోజే అక్షయతృతీయాన టిటిడికి 90,70,667 రూపాయలు ఆదాయం లభించింది.

# అనుమతి లేని, నిబంధనలు పాటించని భవనాలు కోకోల్లలు

**-తిరుపతిరూరల్లో వందల కొలది అనుమతి లేని భవనాలు**



తిరుపతిరూరల్, మే2 ప్రభాతవార్త: తిరుపతిరూరల్ మండలంలో అనుమతిలేని... నిబంధనలు పాటించని భవనాలు కో కోల్లలుగా ఉన్నాయి. మొన్న తిరుమల నగర్ పంచాయతీలో జరిగిన దుర్ఘటన అనంతరం డిపిఓ ఆదేశాల మేరకు తిరుపతిరూరల్ మండలంలో అనుమతి పొందని, నిబంధనలు పాటించని, పొందిన అనుమతి కన్నా ఎక్కువ అంతస్తులు నిర్మించిన భవనాలను పంచాయతీ కార్యధర్శులు గుర్తిస్తున్నారు. త సర్వేలో పంచాయతీ కార్యదర్శులు విస్తుపోయే విధంగా అనుమతి లేని, నిబంధనలు పాటించి భవనాలను గుర్తించి నోటీసులు జారీ చేస్తున్నారు. తిరుపతిరూరల్ మండలంలో వున్న 34 గ్రామ పంచాయతీలు ఉండగా ప్రతి పంచాయతీ లోను అనుమతి పొందని, నిబంధనలు పాటించని భవనాలు ఉన్నాయి. స్థానిక రాజకీయ నేతల సిఫారస్సులు, పంచాయతీ కార్యధర్శుల చేతివాటం, అధికార పార్టీ నేతల ప్రభావంతో అనేక భవనాలు పంచాయతీ అనుమతి జీ+2 అనుమతి పొంది 5అంతస్తులు భవనాలు నిర్మిస్తున్నారు. మరి కొందరు మండలంలో భారీ భవంతులు, అపార్టుమెంట్స్ నిబంధనలకు విరుద్దంగా నిర్మిస్తూ...పంచాయతీకి కనీసం బెటర్‌మెంట్ చార్జీలు చెల్లించడం లేదని కార్యధర్శులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భవన నిర్మాణం కోసం తుడకు ఇచ్చే బ్లూ ప్రింట్ నిబంధనల ప్రకారం ఉంటే ఆచరణలో మాత్రం నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణం జరుగుతుంది. తిరుపతినగర పరిధి విస్తరించడంతో తిరుపతిరూరల్ మండలం అపార్టుమెంట్ సంస్కృతి రోజురోజుకు పెరుగుతుంది. మండలంలో నిర్మిస్తున్న అపార్టుమెంట్స్ ఎదైన అగ్ని ప్రమాదం జరిగిన ప్రమాదాన్ని నివారించలేని దుస్థితి నెలకొని ఉంది. ఇప్పటికైై అధికారులు పూర్తి క్షేత్రస్థాయిలో సర్వే చేసి, అనుమతి లేని, నిబంధనలు పాటించని భవనాలపై కొరఢా ఝుళిపించాల్సిన అవసరం ఉంది.

## రోగులపాలిట...దేవుడు!

**-తిరుపతి బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా డాక్టర్ జగదీశ్**



తిరుమల,మే 2ప్రభాతవార్తప్రతినిధి: ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యుడు,తిరుపతి బర్డ్‌ఆస్పత్రి మాజీ డైరెక్టర్ డాక్టర్ జగదీశ్‌కు మరోసారి రోగులకు మెరుగైన సేవలందించే భాగ్యం కలిగింది. టిటిడి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బర్డ్ ఆస్పత్రికి పునర్‌వైభవం తీసుకురావడమేగాక పలురకాలుగా దివ్యాంగులుగా, కాళ్ళుచేతులు విరిగిపోయిన రోగులకు నాణ్యమైన మెరుగైన అందించేందుకు ఆయన శ్రాయశక్తులా కృషి చేయనున్నారు. రోగులపాలిట దేవుడుగా ఆయన బర్డ్‌ఆస్పత్రికి సేవలందించాడు. నాలుగు దశాబ్ధాలుగా వైద్యవృత్తిలో ఉన్న ఆయన గగతంలో బర్డ్ ఆస్పత్రి డైరెక్టర్‌గా విశిష్టసేవలందించాడు. ఆస్పత్రిలో అన్ని విభాగాల వైద్యులతో ఆప్యాయంగా పలకరించి వారి సేవలను మెరుగ్గా అందించేలా చూశారు. దేశం నలుమూలల నుండి బర్డ్‌కు వచ్చే రోగులకు ఆప్యాయంగా ఆయన సేవలందించడం ప్రత్యేకత. గత ఐదేళ్ళ వైసిపి ప్రభుత్వంలో బర్డ్‌లో శస్త్రచికిత్సలపై అనేక ఆరోపణలు వెల్లువెత్తాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన పదినెలల తరూవాత తిరిగా ప్రముఖ వైద్యుడు డాక్టర్ జగదీశ్‌కే బర్డ్ నిర్వహణ బాధ్యతలు అప్పగించడం తన ప్రాణం వున్నవరకు పేదలకు సేవచేయడమేనని అన్నారు.

## రాయితీతో తాయిలం... రూ.2కోట్లు పన్ను వసూళ్ళు

శ్రీకాళహస్తి పురపాలక సంఘము SRIKALAHASTI MUNICIPALITY

శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త : ప్రభుత్వం ప్రకటించిన అడ్వాన్సు పన్నులు చెల్లించిన వారికి రాయితీ తాయిలం కొందరు పన్ను చెల్లింపుదారులకు వరంగా మారింది. ఏడాది ప్రారంభం లోనే రాయితి తాయిలంతో రూ.2కోట్లు పన్నుల వసూలు చేసిన సిబ్బందికి కమిషనర్ బియస్ గిరికుమార్ అభినందించారు. ప్రతి ఏడాది అడ్వాన్సు పన్నుల వసూళ్ళపై ప్రభుత్వం రిబేటు ఇవ్వటం ఆనవాయితి. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా ఏప్రిల్‌లో అవకాశం కల్పించారు. శ్రీకాళహస్తి మున్సిపల్ ఆస్తిపన్నుల డిమాండ్ రూ.8కోట్లు కాగా మొదటి నెలలోనే రూ. 2కోట్లు వసూలు చేసారు. ముందుగా పన్నులు చెల్లించిన పన్ను దారులకు రూ.10లక్షలు మిగిలినట్లు కమిషనర్ బి.యస్.గిరికుమార్ వివరించారు. ఈ ఏడాది ఆస్తిపన్ను డిమాండ్ 8,45,86,316లు కాగా ఏప్రిల్ 30 నాటికి ఊ.2,48,86,400లు వసూళ్లు అయ్యాయి. రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటిలో ఆస్తి పన్ను చెల్లింపుదారులకు అడ్వాన్సు పన్నుల చెల్లించే వారికి 5శాతం రిబేటుప్రకటించారు. దీంతో కొందరు భారీ ఎత్తున పన్ను చెల్లింపుదారులు ముందుకు వచ్చారని కమిషనర్ బి.యస్‌గిరికుమార్ శుక్రవారం తెలిపారు.




# లక్ష్యం నిర్ధేశించుకుని సాధించడానికి కృషి

**-500 మార్కులకు పైగా సాధించిన విద్యార్థులకు కలెక్టర్ సర్టిఫికేట్లు ప్రదానం**

చిత్తూరురూరల్, మే 2 ప్రభాతవార్త:
విద్యార్థులు ఒక లక్ష్యంను నిర్దేశించుకుని లక్ష్య సాధనకు శ్రమించాలని జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని కలెక్టర్ ఛాంబర్‌లో శుక్రవారం బిసీ వసతి గృహాల్లో 2024-25 విద్యా సంవత్సరంలో టెన్త్ పరీక్షల్లో 500కు పైగా మార్కులు సాధించిన 9 మంది విద్యార్థులకు కలెక్టర్ సుమిత్‌కుమార్ మెరిట్ సర్టిఫికేట్ల ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ భవిష్యత్ పట్ల స్పష్టమైన ఒక లక్ష్యంను నిర్దేశించుకుని లక్ష్యం వైపు అడుగులు వేయాలన్నారు. విద్యార్థుల ఆలోచనలను తప్పుదోవ పట్టించే సామాజిక మాధ్యమాలకు దూరంగా వుండాలని సూచించారు. ప్రపంచంతో పోటీ పడేలా మాతృభాషలో ప్రావీణ్యంతో పాటు ఆంగ్ల భాషపై పట్టు



సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ చేతుల మీదుగా పలమనేరు బిసీ బాలుర వసతి గృహం విద్యార్థి యు.రాకేష్ యాదవ్(553), పుంగనూరు బిసీ బాలుర వసతిగృహం వవిద్యార్థి జి.చరణ్‌తేజ (552), వి.కోట బిసీ బాలికల వసతిగృహం విద్యార్థిని ఎం.వర్ష(546), పుంగనూరు బిసీ బాలుర వసతిగృహం విద్యార్థి సిపి దీపక్(543), కత్తిరిపల్లి బిసీ బాలుర వసతిగృహం విద్యార్థి ఇ.తరుణ్(519), విఆర్‌కుప్పం బిసీ బాలుర వసతి గృహం విద్యార్థి ఓ.జతీష్ (518), పచ్చికాపలం బిసీ బాలువ వసతిగృహం విద్యార్థి జి.దినేష్(503), పాలసముద్రం బిసీ బాలికల వసతి గృహం విద్యార్థిని సి.తులసీ (502), వి.కోట బిసీ బాలికల వసతిగృహం విద్యార్థిని సి.గాయత్రి (501)లకు మెరిట్ సర్టిఫికేట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా బిసీ సంక్షేమ సాధికారిత అధికారి కె.మునీంద్రయ్య, అసిస్టెంట్ బిసీ వెల్ఫేర్ ఆఫీసర్ సోమసుందర్‌రెడ్డి, కుప్పస్వామి, ఉమాదేవి, హేమలత, కోటేశ్వరరావు, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

## ఉరేసుకుని యువకుడు ఆత్మహత్య



కుప్పం, మే 2 ప్రభాతవార్త :
ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం కుప్పం పట్టణంలో చోటు చేసుకుంది. కుప్పం అర్బన్ ఎస్సై బాబు తెలిపిన మేరకు వివరాలిలా.. గుడుపల్లె మండలం కంచిబందార్ల పల్లికి చెందిన చిరంజీవి (24) అనే యువకుడు కుప్పంలో నివాసం ఉంటున్న బాబుస్వామి వద్ద గత కొన్నేళ్లుగాపనిచేసేవాడు. శుక్రవారం ఉదయం చిరంజీవి బాబుస్వామి ఇంటి వద్దకు చేరుకోగా అప్పటికే బాబుస్వామి పనినిమిత్తం బయటకు బయలుదేరుతూ చిరంజీవిని సైతం రమ్మని పిలిచారన్నారు. అయితే తాను ఆ తర్వాత వస్తానని చెప్పిన చిరంజీవి పనికి వెళ్లక బాబుస్వామికి చెందిన ఇంటికి వెళ్లి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. పని ముగించుకుని మరలా బాబుసా ్వమి తదితరులు ఇంటికి రాగా తలుపు లోపలనుంచి గడియపెట్టి ఉండడంతో అనుమానం వచ్చి ఫోన్ చేసినా చిరంజీవి తలుపులు తీయలేదు. దీంతో బాబుస్వామి పోలీసులకు సమాచారం అందించగా పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని తలుపులు తీసి చూడగా చిరంజీవి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు గుర్తించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

## అనాధ మృతదేహానికి మాజీ సర్పంచ్‌చే అంత్యక్రియలు

కుప్పం, మే 2 ప్రభాతవార్త:



చెన్నై- బెంగళూరు రైలు మార్గంలో ఇటీవల రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందిన విషయం విదితమే. వృద్ధురాలి వివరాలకు కుప్పం రైల్వే పోలీసులు విచారించగా ఎవరూ ముందుకు రాలేదు. దీంతో శుక్రవారం వృద్ధురాలి మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిం చాలని రైల్వే హెడ్‌కానిస్టేబుల్, సిబ్బంది డికెపల్లి మాజీ సర్పంచ్ డివి సుబ్రమణ్యం (డికెపల్లి మణి)కి సమాచారం ఇచ్చారు. దీంతో స్పందించిన డికెపల్లి మణి తన సొంత ఖర్చులతో సంప్రదాయం ప్రకారం కుప్పంలో అంత్యక్రియలను ఘనంగా నిర్వహించి మరోమారు తనలోని మానవత్వాన్ని చాటుకున్నారు.

## ఘనంగా ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలు

కాణిపాకం, మే 2 ప్రభాతవార్త:



జగద్గురు ఆది శంకరాచార్యుల జయంతి వేడుకలను శుక్రవారం కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా కాణిపాకం దేవస్థానం ప్రధాన ఆలయం లోని అలంకార మండపంలో ఆదిశంకరాచార్యుల చిత్రప టాన్ని వుంచి అర్చకులు వేద పండితుల మత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర ్వహించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ప్రధాన అర్చకులు సోమశేఖర్ గురుకుల్, స్థానాచార్యులు పణిస్వామి అధికారులు, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.

## ఓ ఇంట్లో చోరీ - పోలీసులకు ఫిర్యాదు

పలమనేరు,మే 2 ప్రభాతవార్త:
మండలంలోని కొలమాసనపల్లె గ్రామంలో ఓ ఇంట్లో చోరీ జరిగింది.బాధితుల కథనం మేరకు కొలమాసనపల్లె గ్రామంలో మాజీ ఎంపిటిసి మంజుల కుటుంబ సభ్యులతో గురువారం ఓ వివాహానికి వెళ్లి తిరిగి శుక్రవారం ఇంటికి రాగా ఇంటిలోని 20 గ్రాముల బంగారు,500 గ్రాముల వెండి వస్తువులు,రూ.80 వేలు నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు.ఈ మేరకు స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోండి

పలమనేరు,మే 2 ప్రభాతవార్త:
ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం నిరుద్యోగ యువతి యువకులకు ఏర్పాటు చేసిన ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డా.వెంకటేశులు తెలిపారు.స్థానిక డిగ్రీ కళాశాలలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన స్కిల్ హబ్ ఆధ్వర్యంలో 10వ తరగతి ఆపై విద్యా పూర్తి చేసిన విద్యార్థులకు రెండు కోర్సులను ప్రరంభించడం జరిగిందిని ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ బెవలప్మెంట్ మరియు నేషనల్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ద్వారా సర్టిఫికెట్ అందించడం జరుగుతుందని ఆయన తెలిపారు.ఈ కోర్సులకు ఈ నెల 7 రిజిస్ట్రేషన్ ఆఖరి తేది అని వివరాలకు అభ్యర్థులు 8465830771కు సంప్రదించాలని తెలిపారు.

## వడ్డిపల్లిలో 7నుంచి శ్రీ రాళ్లగంగమ్మ జాతర

కుప్పం, మే 2 ప్రభాతవార్త :
మున్సిపల్ పరిధి వడ్డిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న రాళ్ల గంగమాంబ అమ్మవారి జాతర ఈనెల 7-11తేదీల మధ్య జరుగుతుందని ఆలయ కమిటీ, గ్రామస్తులు తెలిపారు. ప్రతి రోజు అమ్మవారి ఉత్సవం ఊరేగింపు, అన్నదానం, భక్తుల కాలక్షేపంకై హరికథ, వీధి నాటక ప్రదర్శనలు ఉంటాయన్నారు. 11న అమ్మవారికి పొంగళ్ల సమర్పణతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

## అమరావతికి తరలిన ముఖ్యనేతలు

కుప్పం, మే 2 ప్రభాతవార్త :
సిఎం చంద్రబాబునాయుడు పిలుపు మేరకు నూతన కుప్పం మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, తెదేపా కౌన్సిలర్లతో సహా పలువురు ముఖ్యనేతలు అమరావతికి పయనమయ్యారు. శనివారం సిఎం చంద్రబాబునాయుడు నూతన మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లతో కుప్పం మున్సిపల్ అభివృద్ధిపై సమీక్ష, కార్యాచరణ ప్రణాళికపై చర్చించనున్నట్లు తెలిసింది. ఈ సమావేశంకు ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి బిఆర్ సురేష్‌బాబు సైతం హాజరవుతారని సమాచారం.

## ఘనంగా శ్రీలక్ష్మీనరసింహస్వామి జాతర ప్రారంభం

కుప్పంరూరల్, మే 2 ప్రభాతవార్త :
మండలంలోని ఊరినాయనపల్లిలో వెలసిన శ్రీ ఆవుల మల్లయ్యస్వామి, శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి జాతర ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. ఈసందర్భంగా గ్రామంలో స్వామివారి ఉత్సవాన్ని ఊరేగించారు. శనివారం రాత్రి అఖండజ్యోతి దర్శనం, స్వామివారిపుష్పపల్లకి, బాణవేడుకలు, ఆదివారం వసంతోత్సవంతో జాతర ముగుస్తుందన్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని గ్రామస్తులు కోరారు.

## కంగుందిలో శ్రీ కాళికాంబ అమ్మవారి జాతర

కుప్పం, మే 2 ప్రభాతవార్త :
మండలంలోని కంగుంది గ్రామంలో వెలసిన శ్రీ ప్రసన్న కాళికాంబ అమ్మవారి జాతర ఈనెల 9-11తేదీల మధ్య జరుగుతుందని గ్రామస్తులు తెలిపారు. 9వతేది గ్రామంలోని అన్ని ఆలయాల్లో పూజలు, అభిషేకం, గుర్రంపై అమ్మవారి విగ్రహం ఊరేగింపు, 10వతేది అమ్మవారి రథోత్సవం,11న అంబలిపోయుట, ఊంజల్ సేవతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు.

## కిషోరి వికాస వేసవి విజ్ఞాన శిక్షణ

కల్లూరు, మే 2 ప్రభాతవార్త :



పులిచెర్ల గ్రామ సచివాలయంలో శుక్రవారం జిఎంఎస్‌కె గీతావాణి ఆధ్వర్యంలో కిషోరి వికాస వేసవి విజ్ఞాన తరగతులను సర్పంచ్ రాణి ప్రారంభించారు. మొదటి రోజు శిక్షణలు బాలికలు ఒకరికి ఒకరు పరిచయం చేసుకోవడం, లక్ష్యాలు నిర్ణయించుకోవడం జరిగింది. అనంతరం శిక్షణా పోస్టర్లను విడుదల చేశారు. ఈ శిక్షణ కార్యక్రమంలో వీఆర్వో రెడ్డన్న, అంగన్వాడి కార్యకర్తలు, మోబినాతాజ్ బేగం, పార్వతి, సుజాత, మాధవి. ఏఎన్ఎం రాణి, ఆశా కార్యకర్తలు సుగుణ, శివరాణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రాంగణ ఎంపికలో ఉద్యోగాలు




గంగవరం,మే 2 ప్రభాతవార్త:
మండలంలోని ఎంవిఆర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రాంగణ ఎంపికలో 30 మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపిక కావడం జరిగిందని కళాశాల కరెస్పాండెంట్ ఎం.వి.ఆర్ రెడ్డి తెలిపారు. స్థానిక కళాశాలలో బెంగళూరుకు చెందిన ఆల్ డిజిటెక్,క్యూసిఎస్ కంపెనీ ప్రతినిధులు విద్యార్థులకు ప్రంగణ ఎంపిక నిర్వహించగా కళాశాలకు చెందిన 30మంది ఉద్యోగాలకు ఎంపికకావడం జరిగిందని ఆయన తెలిపారు.ఈ కార్యాక్రమంలో కంపెనీల హెచ్ఆర్‌లు బావా ఫకృద్ధీన్,ముక్తియార్,కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీసుధ తదితరులు పాల్గొన్నారు.

## వెదురుకుప్పం వైభవంగా ఉత్తర గోగ్రహణం

వెదురుకుప్పం, మే 2 ప్రభాతవార్త :



మండల కేంద్రంలోని చవటగుంట మహాభారత వార్షికోత్సవ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉత్తర గోగ్రహణం కార్యక్రమం నిర్వహించారు. ఉదయం ఆలయం శుద్ధి చేసి మూలవిరాట్, ఉత్సవమూర్తులను వివిధ అభిషేకాలు. ఆలయ ప్రాంగణంలో అర్జునుడు పాండవులు జమ్మి వృక్షంలో దాచిన ఆయుధాలు తీసి పూజలు చేపట్టడం, ఆవులను మలించే కార్యక్రమం అద్భుతంగా ప్రదర్శించారు. అర్జునుడు, ఉత్తర కుమారుల వేషాదారులు ఉత్తర గోగ్రహణం కార్యక్రమ ఉభయదాతలు పాలకుంటచేనుకు చెందిన నలిపిరెడ్డి కృష్ణారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుబ్రమణ్యంరెడ్డి, మోహన్‌రెడ్డిల ఇంటికి చేరుకుని అర్జున ఉత్సవ విగ్రహంతో వెళ్ళి ప్రత్యేక పూజ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పేట నీరాజ రాధాకృష్ణారెడ్డి, కార్యనిర్వహకులు కృష్ణారెడ్డి, ఆంజనేయులురెడ్డి, హరినాధరెడ్డి, నరసింహారెడ్డి, రామయ్య, ప్రకాష్,ఆనందరెడ్డి, జయరాం, పురోహితులు గౌరీశంకర్, పెద్ద సంఖ్యలో మహిళ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## మూత మూయని నీటి తొట్టి

**- భయందోళనతో చవటపల్లి ప్రజలు**



**పూతలపట్టు, మే 2 ప్రభాతవార్త :** తిరుపతి - బెంగళూరు జాతీయ రహదారి ప్రారంభించి ఆరు సంవత్సరాలు పైగా వస్తున్న పి కొత్తకోట గ్రామ పంచాయతీలో చవటపల్లి దగ్గర రైల్వే బ్రిడ్జి కింద వర్షం పడితే నీరు నిలుస్తుందని చవటపల్లి హరిజనవాడ గ్రామం పక్కన నీటి తొట్టి కట్టారు దాదాపు 50 అడుగులు పైగా లోతు, 30 అడుగులు వెడల్పు ఉంటుంది గత కొన్ని రోజుల క్రితం ఆ తొట్టి పనులు చేపట్టి తొట్టి మూత వేయలేనందువలన ప్రమాదాలు జరిగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని చవటపల్లి గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు నీటి తొట్టి మా గృహములో పక్కనే ఉండడంతో చిన్నపిల్లలు, ముసలి వాళ్లు అటుపక్క వెళ్లకుండా ఉండడానికి గ్రామస్తులు కొందరు కాపలా కాయాల్సి వస్తుంది. నీటి తొట్టి చాలా భయంకరంగా ఉంది లోపల పడినవారిని ఇక మరిచిపోవాల్సిందే అని గ్రామస్తులు చెబుతున్నారు. అందువల్ల జాతీయ రహదారి అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని నీటి తొట్టి మరియు విద్యుత్ మోటార్ దగ్గర 1 లేదా 2 సిబ్బంది ని ఉంచాలని చవటపల్లి హరజనవాడ గ్రామస్తులు కోరుతున్నారు.

## అమాసను కలసిన ఎస్కేఆర్



**చౌడేపల్లి, మే 2 ప్రభాతవార్త :** డిసిసిబి ఛేర్మన్ అమాస రాజశేఖర్‌రెడ్డిని అయ్యప్ప సాయిరామ్ చారిట బుల్ ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు, తేదేపా నాయ కుడు ఎస్.కె.వెం కట్రమణారెడ్డి కలిశారు. నూతనంగా బాధ్య తలు చేపట్టినంతరం ఆయన్ను తన నివాసం చిత్తూరులో కలసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా జిల్లా న్యాయస్థానంలో పిపి అయిన రఘురామ్ గృహ ప్రవేశానికి హాజర య్యారు. టిఎన్‌టియుసి రాష్ట్ర కార్యదర్శి జెల్లి మనోహర్, సర్పంచుల సంఘ జిల్లా మాజీ అధ్యక్షుడు యధుశేఖర్‌నాయుడు, రాజంపేట పార్లమెంటరీ తేదేపా ఉపాధ్యక్షుడు ఆసూరి బాలాజీ పాల్గొన్నారు.

## వైష్ణవీదేవీ ఆలయంలో పూజలు




**చౌడేపల్లి, మే 2 ప్రభాతవార్త :** మండలం లోని పంచాయతీ కేంద్రం పుదిపట్లలో గల స్వయంభు వైష్ణవీదేవీ ఆలయంలో శుక్రవారం విశేష పూజలు జరిగాయి. ఆలయ ప్రధానార్చకురాలు శ్రావణిచే అమ్మవారికి విశేషాభిషేకం, వివిధ రకాల పుష్పాలతో అలంకరించారు. పలు ప్రాంతా నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి వైష్ణవీదేవిని దర్శించుకొన్నారు. వారందరికీ ఆలయ నిర్మాణకర్త వినోద్‌కుమార్‌రెడ్డి పవిత్ర తీర్థ ప్రసాదాలందించారు.

## పెద్దిరెడ్డిని కలసిన వైకాపా నాయకులు

చౌడేపల్లి, మే 2 ప్రభాతవార్త :



మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపి పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డిలను మండలంలోని వైకాపా నాయకులు కలశారు. శుక్రవారం వారి నివాసం తిరుపతిలో కలసి మండల సమస్యలను వివరించారు. ఇటీవల నూతనంగా నియమితులైన మండల వైకాపా అధ్యక్షుడు గౌడప్పగారి నాగభూషణరెడ్డి, విద్యార్థి విభాగ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కళ్యాణ్ భరత్‌లను అభినందించారు. అధైర్య పడకండి అండటా వుంటానని పెద్దిరెడ్డి వారికి భరోసా ఇచ్చారు. జడ్పీటీసీ నండిపల్లి దామోధర్‌రాజు, రాజంపేట పార్లమెంటరీ నియోజకవర్గాల యువజన అధ్యక్షుడు మిద్దింటి కిషోర్, మాజీ ఎంపిపిలు కూరపర్తి అంజిబాబు, రుక్మిణమ్మ, నరసింహారెడ్డి, అల్తాఫ్, సుబ్రమణ్యం, రమేష్, వెంకట్రమణ, శ్రీనివాసులు, బాబు, అమరనాథ్ మండలంలోని వైకాపా నాయకులు, కార్యకర్తలు పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను కలిసన వారిలో వున్నారు.

## 11న మాలల ఆత్మగౌరవ మహాసభ



చౌడేపల్లి, మే 2 ప్రభాతవార్త :
ఈనెల 11న తిరుపతిలో మాలల ఆత్మ గౌరవ మహాసభను నిర్వహించనున్నట్లు మాలల జెఏసి కన్వీనర్ మల్లారపు మధు తెలిపారు. ఈ మేరకు స్థానిక ఎంపిడిఓ కార్యాలయ ఆరణంలో సంబంధిత పోస్టర్లను ఆవిష్కరించారు. బ్యాంకు రెడ్డెప్ప, కూరపర్తి శ్రీనివాసులు, రా మ్మూర్తి, కృష్ణమూర్తి, నంద, శంకర, డిష్ సూరి, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

## ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త :
స్థానిక తెలుగుగంగ కాలనీలో ఉన్న గిరిజన సంక్షేమ బాలికల గురుకుల కళాశాలలో జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు పదో తరగతి పాసైన ఉమ్మడి చిత్తూరు జిల్లా విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ దామోదరనాయుడు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపిసి, బైపిసి, సిఈసి గ్రూపులకు దరఖాస్తు చేసుకునే విద్యార్థినులను పదోతరగతి మార్కుల మెరిట్ ఆధారంగా ఎంపిక చేయబడు తారని వివరించారు. ఈనెల 18వ తేదీ లోపు ఆన్‌లైన్‌లో (https:// twreiscet.apcfss.in/) ద్వారా కానీ, ఆఫ్‌లైన్ ద్వారా కానీ దరఖాస్తులు చేసుకోవచ్చు న్నారు. ఒక్కొక్క గ్రూపుకు 40 అడ్మిషన్లు ఖాళీ ఉండగా, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎస్టీలకు 37, ఎస్సీ 1, బిసి 1, ఓసి 1 సీటు కేటాయిస్తున్నట్లు తెలిపారు. రూ.లక్ష లోపు వార్షికాదాయం ఉన్న వారు మాత్రమే దరఖాస్తులకు అర్హులని తెలిపారు. వివరాలకు 9440204745 నంబరును సంప్రదించాల్సిందిగా కోరారు.

## యాదవ సంఘం ఆధ్వర్యంలో విద్యార్థులకు బహుమతులు

తొట్టంబేడు, మే 2 ప్రభాతవార్త:



పదోతరగతి, ఇంటర్‌మీడియట్ పరీక్ష ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సంపాదించిన యాదవ విద్యార్థులు 450 మార్కులు సాధించిన ప్రభుత్వ విద్యార్థులకు అదేవిధంగా ప్రైవేటు పాఠశాలల్లో చదివిన విద్యార్థులు 500 మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్‌లో పాస్ అయిన విద్యార్థులు సుమారు 80మంది విద్యార్థులకు నగదు బహుమతి, సర్టిఫికెట్స్ ఫైల్స్ ప్రధానం చేయడం జరిగింది. అదేవిధంగా కెరియర్ గైడెన్స్ అండ్ కౌన్సిలింగ్ ఇవ్వబడింది. కార్యక్రమంలో తిరుపతి నుంచి ఉమ్మడి జిల్లా ఏపిఎన్ ఎన్‌జిఓ ప్రధాన కార్యదర్శి మరియు శ్రీకాళహస్తి తాలూకా అధ్యక్షుడు సి.చెంచురత్నంయాదవ్, బస్సలక్ష్మయ్య, వెంకటరత్నం, వెంకటగిరి మునిరాజ, డాక్టర్లు చంద్రశేఖర్, చైతన్యయాదవ్‌లు అక్కుపల్లి లక్ష్మీప్రసాద్, అక్కుపల్లి మధుసూధన్‌యాదవ్, ఆర్.గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ సమస్యను పరిష్కరించిన సిఐ

శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త :



పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ప్రతిరోజు సాయంత్రం స్థానిక పెండ్లిమండపం కూడలి, మరియు బేరివారి మండం వద్ద వన్‌వే బోర్డులు ఏర్పాటుచేసిన ఇక్కడ ట్రాఫిక్ కానిస్టేబుల్ ఉన్నా తూతూ మంత్రంగా పోలీసులు బోర్డులు పెట్టి చేతులు దులుపేసి కోవడంతో ఈమార్గంలో వాహనాలు యధేచ్చగా కొనసాగుతున్నాయి. ఈ మార్గంలో వెళ్ళాలంటే కొత్తకోనేరు వరకు లీటరు పెట్రోలు ఖర్చు తప్పదు మరి. శుక్రవారం సాయంత్రం పెండ్లిమండపం వద్ద ట్రాఫిక్ సమస్య రావడంతో సమాచారం అందుకున్న సిఐ డి.గోపి అక్కడకు వెంటనే చేరుకుని ఇక్కడ ఉన్న ట్రాఫిక్ సమస్యను పరిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్యకు ప్రజలు కూడా సహకరించాలని లేదంటే చట్టపరమైన చర్యలుతీసుకుంటామన్నారు. ప్రతిరోజు నాలుగుమాడావీధుల్లో వన్‌వే ట్రాఫిక్ రూల్స్ తప్పకుండా అమలు చేస్తున్నామన్నారు. ప్రజలందరు సహకరించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బాధలకు మన నిర్లక్ష్యంమే కారణమన్నారు

శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త :



శుక్రవారం జామియా మస్జిద్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రేహాన్ మాట్లాడుతూ నేడు జరుగుతున్న వివిధ రకాల బాధలకు మన నిర్లక్ష్యంమే కారణమని, మనం బాధ్యతలను విస్మరిస్తున్నాము. మన వరకు వస్తే తప్ప అర్థం కాదన్నట్లు మారిందన్నారు. మసీదుల నిర్వహణ బాధ్యత కమిటీల మాత్రమే కాదని, ప్రతి రోజూ మసీదులకు వచ్చే ముసల్లిలపై కూడా ఉందన్నారు.

## రామాపురం ఎస్టీ కాలనీలో పల్లెనిద్ర కార్యక్రమం



**శ్రీకాళహస్తిరూరల్, మే 2 ప్రభాతవార్త:** జిల్లా ఎస్పీ హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి సబ్‌డివిజనల్ పోలీస్ అధికారి కె.నరసింహమూర్తి సూచనల మేరకు శ్రీకాళహస్తి మండలం రామాపురం గ్రామం ఎస్టీ కాలనీ సెంటర్‌లో పల్లెనిద్ర కార్యక్రమాన్ని శ్రీకాళహస్తిరూరల్ సిఐ రవినాయక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్టీ కాలనీలో ఉన్న సమస్యలు, పిల్లల చదువులు గురించి తెలుసుకున్నారు. గ్రామస్తులందరితో ముఖాముఖిగా మాట్లాడి పిల్లలు చదువులకు వెళ్ళకుండా మధ్యలోనే పాఠశాల వెళ్ళడం మానేసి కూలి పనులకు పోవడం జరుగుతోందని తెలుసుకున్న సిఐ ప్రతి ఒక్కరికి విద్యే ప్రధానమన్నారు. ప్రస్తుతం వేసవి సెలవులు కావడంతో పనికి వెళ్తున్నారని తల్లిదండ్రులు వివరించారు. ఎవరైనా పాఠశాల వెళ్ళకపోతేతమ దృష్టికి తీసుకురావాలని కోరారు. అనంతరం చిన్నారులకు బాలమిత్ర కథలు పుస్తకాలు, బాలల నీతికథలు, జామెట్రీ బాక్సులు అందించారు. కార్యక్రమంలో సిఐ రవినాయక్‌తో పాటు కానిస్టేబుల్స్ భరత్, నాగరాజు ఫిరోజ్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## రెండు మోటార్‌సైకిళ్ళు ఢీ...ఒకరి పరిస్థితి విషయం



**శ్రీకాళహస్తి,రూరల్, మే 2 ప్రభాతవార్త :** మండలంలోని అమ్మపాళెం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయ పడ్డారని వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉందని తెలిపారు.గ్రామస్థులు అందించిన సమాచారం మేరకు వివరాలు ఇలా వరదయ్యపాళెం నుంచి ముగ్గురు యువకులు మోటార్‌సైకిల్‌పై అమ్మపాళెంకు వస్తున్నారు.ఎదురుగా మరో మోటార్ సైకిల్‌పై శ్రీకాళహస్తికి ఓ యువకుడు వస్తుండగా రెండు మోటార్ సైకిల్స్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో అమ్మపాళెంకు చెందిన కొండయ్య(50) తీవ్రంగా గాయపడ్డారు. ఆతని పరిస్థితి విషమంగా ఉండటంతో శ్రీకాళహస్తిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వరదయ్యపాళెం యువకులు స్వల్పంగా గాయపడ్డారు. అయితే పోలీసులకు ఎలాంటి సమాచారం అందలేని తెలిసింది.

## మృతులకు నివాళులు అర్పించిన...బృందమ్మ

**తొట్టంబేడు, మే 2 ప్రభాతవార్త :**



పట్టణంలోని గోపాలవనంలో ఉన్న కాకర్ల ఉదయ్‌శేఖర్ శుక్రవారం స్వర్గస్తులయ్యారు. వీరి భౌతిక కాయానికి ఎంఎల్ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి మాతృమూర్తి బొజ్జలబృందమ్మ మరియు పట్టణ అధ్యక్షులు జి.విజయ కుమార్‌లు పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కాగా పట్టణంలోని గాంధీవీధిలో ఉన్న పోలినేని వెంకటనారాయణ చౌదరి మృతి చెందడంతో అక్కడకు చేరుకుని బృందమ్మ నివాళులు అర్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మృతులకుటుంబాలకు అండగా ఉంటామని తెలిపారు.

## అమరావతి పునఃప్రారంభం ఆంధ్రుల కల

**శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త:**



అమరావతి పునఃప్రారంభమవడం ఆంధ్రుల కల అని రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ ఎం.ఉమేష్‌రావు అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విధ్వంసకారుడు జగన్‌రెడ్డితో తుగ్లక్ నిర్ణయాలతో ఐదు సంవత్సరాల పాటు అజ్ఞాతవాసం గడపిన ఆంధ్రుల కలల రాజధాని ప్రజా రాజధాని మళ్ళీ ప్రధాని చేతులుమీదుగా పునః ప్రాణ ప్రతిష్ట చేసుకున్న అమరావతి పరుగు ప్రారంభించిందని హర్షం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్రమోడీ చేతులుమీదుగా ఆంధ్రుల కలల రాజధాని అమరావతి పనుల పునఃప్రారంభోత్సవ కార్యక్రమం ప్రజల సమక్షంలో ఘనంగా నిర్వహించడం జరిగిందని ఇది అన్ని ప్రాంతాలకు వర్గాలకు, కులాలకు సంబందించిన ప్రజా రాజధానిగా ఘనత సాధిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. చంద్రబాబు నాయుడు అపార అనుభవంతో అమరావతిని దేశానికి తలమానికంగా అద్భుతమైన మహానగరంగా తీర్చిదిద్దుతున్నారన్న నమ్మకం ఉందని డిప్యుటీ సిఎం పవన్ కళ్యాణ్‌లు పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో మిన్నల్‌రవి, మునిరాజయాదవ్, కోటచంద్రశేఖర్, సునీల్, భాస్కర్, రామచంద్రయ్య, కృష్ణమూర్తి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## పోలీసుల అదుపులో మందుబాబులు

**శ్రీకాళహస్తి, మే 2 ప్రభాతవార్త:**



పట్టణంలోని జికెరెడ్డి కాలనీ సమీపంలోని ఖాళీ ప్రదేశంలో మద్యం సేవిస్తున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని అర్బన్ సిఐ డి.గోపి తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం నుంచి రాత్రి వరకు ఓపెన్ బూజింగ్ చేస్తున్నామని ఖాళీప్రదేశాల్లో ఎక్కడైనా ఎవరైనా మద్యం సేవిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే అదుపులోకి తీసుకుంటున్నామన్నారు. వారిపై చట్టపరమైన చర్యలు కూడా తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా వేసవి కాలంలో మందుబాబులు మద్యం సేవించరాదని తెలిపారు. మద్యం సేవించడం హానికరమని తెలిసినా యువతతో పాటు పలువురు ప్రజలు మద్యం సేవించడం నిలిపివేయాలని ఓ ప్రకటనలో కోరారు. పట్టణంలోని ఖాళీప్రదేశాల్లో రోజు సాయంత్రం ఓపెన్ బూజింగ్ చేయబడుతుందని వివరించారు. ఎవరైనా మద్యం సేవిస్తున్నట్లు కనిపిస్తే వెంటనే వారిని అదుపులోకి తీసుకుని చర్యలుతీసుకుంటామని సిఐ వివరించారు. ఆయనతో పాటు పలువురు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## గంగమ్మ జాతర భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలి

### –ఫెస్టివల్ కమిటీని నియమించండి

**తిరుపతి,మే 2ప్రభాతవార్త:**

రాయలసీమజిల్లాల్లోనే ఎంతో అంగరంగవైభవంగా వారంరోజులపాటు జరిగే తిరుపతి తాతయ్యగుంగ గంగమ్మజాతరకు విచ్చేసే భక్తులకు సౌకర్యాలు మెరుగుపరచాలని, వెంటనే ఫెస్టివల్ కమిటీని ఏర్పాటు చేయాలని బిజెపి నేత పి.నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. జాతరలో అమ్మవారి దర్శనానికి విచ్చేసే భక్తులకు ప్రత్యేకంగా చలువపందిళ్ళు ,జర్మన్‌షెడ్డు వేయాల న్నారు. జాతరరోజుల్లో గంగమ్మ ఆలయ ప్రాంగణంతోబాటు తుడ మైదానంలో పొంగళ్ళు పెట్టుకునేందుకు మౌళిక సదుపాయాలు కల్పించాలన్నారు. పటిష్టమైన నిఘా పోలీసులు ఏర్పాటుచేయాలని, ఆలయంలో అదనపు సిసి కెమెరాలు, నగరం శివార్లలో భక్తులకు స్వాగతం పలికే అమ్మవారి చిత్రపటాలతో ఆర్చిలు ఏర్పాటుచేయాలని సూచించారు. దేవాదాయశాఖ, ఆలయ అధికారులు జాతర జరిగే 13వతేదీ భక్తులకు చిన్నపాటి ఇబ్బందులు లేకుండా చూడాలని, వివిపిలకు ఒక సమయం కేటాయించాలని, స్థానిక భక్తులకు ప్రత్యేక దర్శనాలు క్యూలైన్లు నిర్వహించాలని కోరారు.

## ఎండలు భగ భగ: దేవాలయం వెల వెల

**శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త :**



తూర్పు మండలాల్లో ఎండలు దడపుట్టిస్తున్నాయి. ఉదయం ఆరు గంటల నుంచే భానుడు తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి.దాంతో ఎప్పుడూ రద్దీగా ఉండే ఆలయంరెండు రోజులుగా వెల వెల బోతుంది. ఆలయ ఆదాయాలే కాకుండా వ్యాపారాలు కూడా చతికిల పడ్డాయి. శుక్రవారం పట్టణంలోని వ్యాపారసంస్థలన్ని మూతపడ్డాయి. ఇక ఆలయం మీద ఆధారపడి జీవిస్తున్న చిరువ్యాపారుల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.ఇక శ్రీకాళహస్తీశ్వరాలయానికి భక్తి శ్రద్దలతో వచ్చే భక్తులు సమాచారం కేంద్రం వద్ద బస్సులు దిగుతారు. ఇక్కడ ట్రాఫిక్ సమస్య అంటూ పాత జయరామారావు పార్కు వద్ద తిరుపతి వైపు నుంచి వచ్చే బస్సులను ఆపి ప్రయాణీకులు,భక్తుల్ని దించేస్తున్నారు. దాంతో మండుటెండల్లో తేరువీధి నుంచి బిక్షాల గాలిగోపురం వద్దకు వెళ్ళాలంటే కొందరు వ్యాపారులు చెప్పులు భద్రత పరుస్తామని మభ్యపెడుతున్నారు.అక్కడ చెప్పులు వదిలేసి ఆలయంలో దర్శనం చేసుకొని బయటకు వచ్చిన వారి బాధలు వర్ణనాతీతంగా మారింది.కాళ్ళు బొబ్బలెక్కుతుండగా పరుగులు తీసుకున్నారు. అయితే ఈ వీధిలో కనీసం నిలవటానికి నీడ కూడా లేదు. దేవస్థానం కనీసం చలఉవ పందిళ్ళు వేస్తే అయినా బాగుంటుంది.కనీసం బిక్షాల గాలిగోపురం వద్ద పందిళ్ళుఏర్పాటు చేయాలని కోరుతున్నారు.



## భక్తులకు చల్లనినీటితో వేడిఉపశమనం

తిరుమలలోనూ ఎండ తీవ్రత ఎక్కువగా ఉంది. భక్తులకు వేడినుండి ఉపశమనం కోసం మజ్జిగ, చల్లని నీరు ఆలయం పరిసరాల్లో శ్రీవారిసేవకులు అందిస్తున్నారు. **ప్రభాతవార్త–తిరుమల**

## భగవద్‌రామానుజులకు రంగస్థలి ప్రత్యేక పూజలు



**తిరుపతి,మే 2ప్రభాతవార్త:** భగవద్ రామానుజులు జన్మించిన వైశాఖమాస ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం రాయలసీమ రంగస్థలి కార్యాలయంలో పూజలు చేశారు. గుండాల గోపీనాథరెడ్డి, కెఎన్‌రాజ, సుబ్రమణ్యంరెడ్డి, రవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవారి ఆశీస్సులందుకున్నా

**తిరుమల,మే 2ప్రభాతవార్తప్రతినిధి:**

శ్రీవేంకటేశ్వరస్వామిని శుక్రవారం ఉదయం ప్రోటోకాల్ బ్రేక్‌లో నగరి ఎంఎల్ఎ గాలి భానుప్రకాశ్ దర్శించుకుని ఆశీస్సు లందుకున్నారు. ఆలయ అధికారులు స్వామివారి దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## సమ్మర్ సెలవుల ప్రకటనలోనూ గందరగోళం

**తిరుపతి విద్య, మే 2 ప్రభాత వార్త:**

ఎస్వీయూ,టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న డిగ్రీ ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలలకు ఈనెల 10వ తేదీ నుంచి జూన్ 15వరకు వేసవి సెలవులు ప్రకటించారు.తొలుత ఈనెల 1వ తేదీ నుంచి సెలవులు ప్రకటిస్తూ అన్ని కళాశాలలకు ఉత్తర్వులు జారీ చేసిన వర్సిటీ అధికారులు మళ్లీ ఆ ఉత్తర్వులను రద్దు చేసి 10వతేదీ నుంచి సెలవులను ప్రకటిస్తూ మరో ఉత్తర్వులు జారీ చేశారు. డిగ్రీ 2వ, 4వ సెమిస్టర్ పరీక్షల నేపథ్యంలో ఈనెల 10 నుంచి సెలవులు ప్రకటించినట్లు తెలుస్తోంది. అయితే అధికారుల నిర్లక్ష్యంతో వాయిదా పడిన పరీక్షలను మాత్రం ఈనెల 12, 14,15 తేదీలలో జరపనున్నట్లు అధికారులు వెల్లడించారు.సెలవుల ప్రకటనలోనూ అధికారులు విద్యార్థులను ఆందోళనకు గురిచేశారు.

## ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా రామ్‌నాయక్

**కేవీబీపురం, మే 2 ప్రభాతవార్త:**



కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిగా బి.ఎల్.రామ్‌నాయక్ బాధ్యతలు చేపట్టారు. ఆయన పెనుగులు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి బదిలీపై కేవీబీపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అన్ని రకాల వ్యాధులకు పాము కాటుకు, కుక్కకాటుకు మందులు అందుబాటులో ఉన్నాయని, ఎల్లవేళలా పీసీలు వైద్య సదుపాయాలు పొందవచ్చునని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బీపీ, షుగర్ పరీక్షలు చేసుకోవచ్చని ఆయన వివరించారు. కార్యక్రమంలో రజని, ఎంపీహెచ్‌వో రాజు, చిట్టి, సుబ్రహ్మణ్యం, ల్యాబ్ టెక్నీషియన్ తులసిరామ్, స్టాఫ్ నర్సు జయలక్ష్మి, ఉనిసబేగం, విజయశాంతి, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వివాహ దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణ

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త :**



జాతీయ సంస్కృత వర్సిటీలో శుక్రవారం వివాహ దివ్యత్వ సాధనం పుస్తకావిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీటీడీ హిందూ ధర్మప్రచార పరిషత్ స్పెషల్ ఆఫీసర్ శ్రీరామ్ రఘునాథ్ ముఖ్యఅతిథిగా విచ్చేసి మాట్లాడుతూ ఇలాంటి పుస్తకాలు సమాజానికి, దాంపత్య జీవితానికి ఉత్తమ మార్గం చూపుతాయన్నారు. జాతీయ సంస్కృత వర్సిటీ వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి,మేడసాని మోహన్,డీన్ సింగరాజు దక్షిణామూర్తి,పీవీ రెడ్డి, ఆముదాల మురళి, శ్రీదేవి,రామకృష్ణ సేవా సమాజం సభ్యులు పాల్గొన్నారు.

## వడదెబ్బకు ఎవరూ గురికాకూడదు : డాక్టర్ బాలకృష్ణ

**రేణిగుంట, మే 2 ప్రభాతవార్త :**

రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఏ ఒక్కరు వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ హెచ్చరించారు. రేణిగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం గాజులమండ్యం విలేజ్ హెల్త్ క్లినిక్, ఎల్లమండ్యం ఆరోగ్య ఉప కేంద్రాలను జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బాలకృష్ణ నాయక్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య ఆరోగ్య కేంద్రాల్లో రోగులకు అందుతున్న సేవల పట్ల ఆరా తీశారు. ఎండాకాలం కారణంగా వడదెబ్బలు తగిలే అవకాశం ఉందని ఆరోగ్య కేంద్రాల్లో తప్పనిసరిగా ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందు బాటులో ఉంచుకోవాలన్నారు. ఎండిసి, సిడి సర్వేలను వేగవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిపిఎంఓ డాక్టర్ శ్రీనివాసరావు, మండల వైద్యాధికారి డాక్టర్ చత్ర ప్రకాష్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఆర్ జి టి 3. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని సందర్శిస్తున్న డాక్టర్ బాలకృష్ణ నాయక్.

## క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో చలివేంద్రం

**పుత్తూరు, మే 2 ప్రభాతవార్త :**



అఖిల భారతీయ క్షత్రియ సంఘం తరపున గత కొన్ని రోజులుగా పుత్తూరు పట్టణంలో మజ్జిగ చలివేంద్రం నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా శుక్రవారం బిజెపి మహిళా మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యురాలు ఎం.నిషిధరాజు ఆధ్వర్యంలో హిమజ స్కూలు వద్ద చలివేంద్రం ఏర్పాటు చేసి చల్లటి అంబలి, ఐస్ క్రీమ్, మజ్జిగ ప్రజలకు అందించారు. కార్యక్రమంలో క్షత్రియ మహాసభ సభ్యులు ఎం.సురేంద్రరాజు, రామ్మోహన్ వర్మ, రామచంద్రరాజు, విష్ణువర్మ, చంద్రబాబు, ప్రసాద్‌వర్మ తదితరులు పాల్గొన్నారు

## యాలి వాహనంపై శ్రీ సదాశివుడు

**పుత్తూరు రూరల్, మే 2 ప్రభాతవార్త:**



పుత్తూరు పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా శుక్రవారం స్వామి, అమ్మవార్లు యాలి వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం ఆలయంలోని శ్రీ కామాక్షిదేవి శ్రీ సదాశివేశ్వర స్వామికి విశేష పూజలు, అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే ఆలయ ఆవరణలో ఉన్న పరివార దేవతలను కూడా విశేష పూజలు చేశారు. స్వామివారిని, అమ్మవారిని విద్యుత్ దీపాలంకరణ ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మంగళ వాయిద్యాల నడుమ పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వామి, అమ్మవార్లకు కర్పూర హారతులు ఇచ్చి పూజలు చేశారు.

## సామూహిక నూతన యజ్ఞోపవీత ధారణ మహోత్సవం



**పుత్తూరు రూరల్, మే 2 ప్రభాతవార్త:**

శంకర జయంతి సందర్భంగా పుత్తూరు పట్టణంలోని శ్రీ గాయత్రీదేవి బ్రాహ్మణ సంక్షేమ సమాఖ్య, శ్రీ గాయత్రీ భవన్‌లో సామూహిక నూతన యజ్ఞోపవీత ధారణ మహోత్సవాన్ని వారు పది మంది వైభవంగా గౌరవ అధ్యక్షుడు ఆలూరు రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా తిరుపతి జిల్లా బ్రాహ్మణ సంఘాల సేవా సమాఖ్య కార్య నిర్వహణ అధ్యక్షుడు, తిరుపతి, చిత్తూరు జిల్లాలో గవర్నింగ్ కౌన్సిల్ మెంబరు, తిరుపతి బ్రాహ్మణ కౌన్సిల్ మెంబరు, తిరుపతి బ్రాహ్మణ కో–ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ వేదం హరిప్రసాద్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సామూహిక ఉపనయనం మహోత్సవం చేయించుకునుటకు తిరుపతి, పుత్తూరు, నగరి, శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, రేణిగుంట నుంచి పాల్గొనడం జరిగింది. నూతన ఉపనయన మహోత్సవం జరుపుకుంటున్న పలువురు జిల్లా సంఘం తరపున వేదం హరిప్రసాద్ వస్త్రాలను అందజేశారు. అనంతరం వేదం హరిప్రసాద్ పుత్తూరు బ్రాహ్మణ సంఘాన్ని అభినందించారు. ఉపనయనం అనేది పవిత్ర ధార వేడుక అని కూడా పిలుస్తారని, గాయత్రి మంత్రం మన బుద్ధి చైతన్యంలో తేజస్సు, స్వచ్ఛతను ప్రేరేపించే ప్రార్థన అని తెలిపారు. అనంతరం ఆలూరు రామకృష్ణ మాట్లాడుతూ ఈరోజు శంకర జయంతిని పురస్కరించుకుని అత్యంత పవిత్రమైన గాయత్రీ మంత్రంలో దీక్ష శుక్రవారం నిర్వహించామన్నారు. కార్యక్రమంలో పుత్తూరు బ్రాహ్మణ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ బాలాజీ, ప్రెసిడెంట్ రమేష్, సెక్రటరీ విజయకుమార్, రేణిగుంట బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు రెడ్డి ప్రకాష్, సూళ్లూరుపేట బ్రాహ్మణ సంఘం ప్రధాన కార్యదర్శి మల్లికార్జున్‌శర్మ, శివకుమార్, పద్మ, అలాగే తిరుపతి జిల్లాల బ్రాహ్మణ సంఘాల సేవా సమితి కన్వీనర్ డా.చక్రపాణి, బ్రాహ్మణ బంధుమిత్రులు పుత్తూరు గాయత్రీబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడు చిట్టమూరు రమేష్, వైస్ ప్రెసిడెంట్ తిప్పావఝ్జల సేతురామన్ శర్మ, సెక్రటరీ విజయకుమార్, మాజీ అధ్యక్షుడు కె.బాలాజీ శర్మ, సంఘ సభ్యులు బాలాజీ రావు, కిరణ్, సురేష్, తిప్పావఝ్జల సేతురామన్ శర్మ, టీచరు హరి తదితరులు పాల్గొన్నారు.

## చెరువు నిండు కుండలా ఉన్నా...

### పంట పొలాలకు అందని సాగునీరు

**విజయపురం, మే 2 ప్రభాతవార్త:**



వండ్లలంలోని కోసలనగరం చెరువు నిండు కుండలా ఉన్నా పంట పొలాలకు సాగునీరు అందడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. కోసలనగరం చెరువు తూములో నీరు వెలుపలకు వదలడానికి ఏర్పాటు చేసిన ఇనుప రాడ్డు మరమ్మతుకు గురికావడంతో నీరు బయటకు రావడం లేదని వాపోతున్నారు. చెరువులో నీరు ఉండి కూడా పంట పొలాలు ఎండుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బావులున్న వారు చెరువు నుంచి వచ్చే ఊటతో మోటారు ద్వారా పంటలకు సాగునీరు అందిస్తున్నారని, బావి లేని వారు పంటలను ఎండ బెట్టుకుంటున్నారని వాపోతున్నారు. ఈ విషయమై మాజీ జడ్పీటీసీ వసంత సుధాకర్‌రాజు నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ దృష్టికి తీసుకెళ్ళడంతో ఆయన ఇరిగేషన్ ఈఈ మురళితో మాట్లాడి సమస్య పరిష్కరించాలని కోరారు. ఈఈ రెండు రెండు రోజుల్లో సమస్య పరిష్కారం చేస్తామన్నారు.

# తిరుపతి డివిజన్

## ఈఎస్ఐలో లే సెక్రటరీ నారాయణప్ప సేవలు ఎనలేనివి

**తిరుపతి హెల్త్, మే 2 ప్రభాతవార్త :**



బీమా వైద్య శాఖలో 38 ఏళ్ళపాటు వివిధ హోదాల్లో పనిచేసి, ఉత్తమ ఉద్యోగిగా జిల్లా కలెక్టర్ నుంచి అవార్డు పొంది, లే సెక్రటరీ, ట్రెజరర్ గ్రేడ్–2గా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన ఎం. నారాయణప్ప అందించిన సేవలు పలువురికి ఆదర్శనీయమైనవని తిరుపతి కార్మిక రాజ్య భీమా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం. శ్యాం బాబు అన్నారు. శుక్రవారం స్థానిక ఆర్.సి రోడ్డు లోని ఈఎస్ఐలో రెండు రోజుల క్రితం పదవీ విరమణ చేసిన ఎం. నారాయణప్పను సిబ్బంది, డాక్టర్లు ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడుతూ కోపం తెలియని వ్యక్తి ఆయన అని పలువురు డాక్టర్లు, సిబ్బంది ఆయన్ని కొనియాడారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ఎం.ఎస్ డాక్టర్ కె. బాల శంకర్‌రెడ్డి, స్పెషలిస్ట్ డాక్టర్లు కె. శ్రీధర్, కె. పద్మావతి, డాక్టర్లు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుక



**తిరుపతిరూరల్, మే2 ప్రభాతవార్త:**

ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని ఐఎన్‌టియుసి ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రత్నకుమార్ ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. శనివారం ఉదయం 10గంటలకు స్థానిక యూత్ హాస్టల్లో ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు ఐఎన్‌టియుసి అనుబంధ సంఘాల నేతలు హాజరై, జయప్రదం చేయాలని కోరారు.

## అతి వేగం కారు బోల్తా... తాత మనవడు మృతి

**చంద్రగిరి, మే 2 ప్రభాతవార్త:**



అతి వేగం కారణంగా కారు అదుపు తప్పి బోల్తాపడిన దుర్ఘటన శుక్రవారం ఉదయం కాశిపెంట్ల వద్ద చోటు చేసుకున్నది. పోలీసుల కథనం మేరకు.. పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి కాశిపెంట్ల వద్ద కారు బోల్తాకొట్టిన ప్రమాదంలో తాత కరేగౌడ్ (64), మనవడు నూతన్ (06) మృతి చెందినట్లు తెలిపారు. ఈ ప్రమాదంలో మరో ముగ్గురు మంజునాథ్, సౌమ్య, దొడ్డమ్మ గాయాలపాలైనట్లు తెలిపారు. బెంగుళూరు, లగేరి గ్రామానికి చెందిన మంజునాథ్, భార్య సౌమ్య, కుమారుడు నూతన్, అత్తమామ దొడ్డమ్మ, కరేగౌడ్ తిరుమల శ్రీవారి దర్శనార్థం వేకువజామున బయలుదేరి వచ్చారు. కాశిపెంట్ల వద్ద వస్తుండగా ఒక్కసారిగా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దీంతో సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలికి చేరుకుని క్షతగాత్రులను 108 వాహనంలో తిరుపతి రుయాకు తరలించారు. అయితే తాత, మనవడు అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ముందు వెళుతున్న వాహనాన్ని అధిగమించడానికి అతివేగంగా వెళ్ళడమే ప్రమాదానికి కారణంగా భావిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## మలుపులు తిరుగుతున్న బదిలీలు

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త :**



ఎస్వీయూలో ఇష్టానుసారంగా జరుగుతున్న బదిలీల వ్యవహారం ఉద్యోగ సంఘాల ఆగ్రహావేశాలతో మలుపులు తిరుగుతోంది.వర్సిటీలో ఇప్పటికే సుమారు 300మంది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగులు అధికారుల బదిలీ వేటుకు బలయ్యారు. ఇందులో భాగంగా గత నాలుగురోజుల క్రితం కొత్తగా 32 మందిని బదిలీ చేశారు.దీంతో ఆగ్రహించిన ఉద్యోగులు, ఉద్యోగ సంఘాల నేతలు అధికారులను బదిలీలపై నిలదీయటంతో ఉద్రిక్త వాతావరణం వరకు వెళ్లిన విషయం విదితమే.ఇందులో భాగంగా బీ10 సూపరింటెండెంట్‌గా ఉన్న నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సెక్రటరీ ఎన్ సుబ్రమణ్యంను సైతం ఆర్టీఐ అండ్ లీగల్ సెల్‌కు బదిలీ చేశారు. దీంతో ఉద్యోగ సంఘాలు కాస్త ఆగ్రహం వ్యక్తం చేసినా చివరికి బదిలీ ఉత్తర్వులను స్వీకరించక తప్పలేదు. అనంతరం వీసీ అప్పారావు,రిజిస్ట్రార్ భూపతి నాయుడు శుక్రవారం మరో మారు ఉద్యోగ సంఘాల నాయకులతో సమావేశమై బదిలీలపై చర్చించారు.

## తేజోకుమార్‌కు వాక్యార్థ చక్రవర్తి బిరుదు

**తిరుపతి విద్య, మే 2 ప్రభాతవార్త :**



జాతీయ సంస్కృత వర్సిటీలో ఐదు రోజుల పాటు జరిగిన శంకర జయంతి ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి.ఈ సందర్భంగా ప్రస్థానత్రయ భాష్య పారాయణం, శంకరుల పూజాబి .షేకం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి వీసీ జీఎస్ఆర్ కృష్ణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.జగద్గురు ఆదిశంకరులు పాదయాత్ర,ఆయన రచించిన స్తోత్రాల ప్రాముఖ్యతను విద్యార్థులకు ఆయన వివరించారు.రిజిస్ట్రార్ కడియం వెంకట నారాయణరావు తిరుమల క్షేత్రం ప్రాధాన్యతను వివరించారు. ఈ సందర్భంగా గోవింద భగవత్ పాదాచార్య వాక్యార్థంలో ప్రతిభ కనబరిచిన తేజ్ కుమార్ కు వాక్యార్థ చక్రవర్తి బిరుదును ప్రధానం చేసి విద్యార్థులను ప్రోత్సహించారు.ఈ కార్యక్రమంలో అకడమిక్ డీన్ రజనీకాంత్ శుక్లా, రాధా గోవింద త్రిపాఠి,కే గణపతి భట్,కేఎస్ సతీష్,నాగరాజ్భట్ మనోక్షిండే, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వేసవి సెలవులు క్రీడా శిక్షణ ప్రారంభం...

### నైపుణ్యం కలిగిన శిక్షకులుచే శిక్షణ

**తిరుపతి క్రీడ, మే 2 ప్రభాతవార్త :** తిరుపతి శ్రీ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో ఈనెల 1వ తేదీ నుండి



సమ్మర్ కోచింగ్ క్యాంప్ ప్రారంభించారు. ఈ వేసవి సెలవులకు విద్యార్థులు క్రీడా సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఇందులో ఉన్న క్రీడలు. స్కేటింగ్, స్విమ్మింగ్, టెన్నిస్, బాస్కెట్బాల్, క్రికెట్, సెటిల్, జూడో, రెస్లింగ్, యోగ, రైఫిల్ షూటింగ్, హాకీ, ఫుట్బాల్, ఇన్ని గేములు ఒకే సముదాయంలో ఉండడం మన తిరుపతి వాసులకి చాలా అదృష్టంగా భావిస్తున్నాం.. ప్రతి క్రీడాకారుడు ఈ శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్ లో ఉన్న క్రీడలను ఆస్వాదించాలి.. క్రీడల్లో అత్యంత స్థాయికి ఎదగాలి అని క్రీడలను ఒకే చోట కేంద్రీకృతమైంది తప్పకుండా తిరుపతి వాస్తవలు ఈ క్రీడా సముదాయాన్ని సందర్శించి నచ్చిన క్రీడల్లో ఎంచుకొని మీ పిల్లలను క్రీడా స్ఫూర్తిని . ఆస్వాదించాలని ఆరోగ్యంగా ఉండాలని ప్రతి విద్యార్థి విద్యార్థినిలు ఈ క్రీడ సముదాయంలో అనేక క్రీడలను ఉన్నత స్థాయికి ఎదిగి రాష్ట్రానికి జాతీయ స్థాయికి పోటీలలో పాల్గొని మన రాష్ట్ర పేరుని నిలబెట్టాలని ప్రారంభించబడింది క్రీడాకారుడు దీన్ని వినియోగించుకోవాలని కోరారు.

## తిరిచ్చిపై విహరించిన అలివేలుమంగ

**తిరుచానూరు, మే 2 ప్రభాతవార్త :**



తిరుచానూరులో పద్మావతి అమ్మవారు తిరుచిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ప్రతి శుక్రవారం సేవలో భాగంగా పద్మావతి అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపం వద్ద కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. తరువాత అమ్మవారిని ఉద్యానవనంకు వేంచేపుగావించి వైభవంగా స్నపన తిరుమంజనం నిర్వహించారు. అనంతరం తిరుచ్చిపై అమ్మవారిని కొలువుతీర్చి తిరుమడవీధులలో ఊరేగించారు. స్థానికులు భక్తులు పెద్ద ఎత్తున కర్పూర నీరాజనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో సూపరింటెండెంట్ రమేష్, ప్రసాద్ ఇన్స్పెక్టర్లు చలపతి, సుభాస్కర్, ఏవీయస్ఓ సతీష్, పాల్గొన్నారు.

## పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : డిఎస్పీ



గూడూరు, మే 2 ప్రభాతవార్త : పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా ఉంచుకోవాలని గూడూరు డి.ఎస్పీ గీతా కుమారి పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని సబ్ డివిజనల్ పోలీసు కార్యాలయ ఆవరణంలో స్వర్ణాంధ్ర స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గూడూరు డి.ఎస్పీ గీతా కుమారి పాల్గొని, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటలన్నారు. పర్యావరణాన్ని మనం కాపాడితే, అది మనల్ని కాపాడుతుందన్నారు. అనంతరం కార్యాలయ ఆవరణంలో మొక్కలును నాటారు. ఈ కార్యక్రమంలో కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మంత్రి మోది సభకు జనసమీకరణ



బాలాయపల్లి, మే 2 ప్రభాతవార్త : అమరావతి రాజధాని పునఃప్రారంభం కార్యక్రమానికి బాలాయ పల్లి మండలం నుంచి 3బస్సులలో జనసమీకరణతో బయలుదేరి వెళ్ళాయి. ఒక్కో బస్సుకు అధికారులను కూడా ఇన్చార్జ్‌లను నియమించారు. వీరిని ప్రధాని మోది ప్రసంగం అనంతరం తిరిగి వారి స్వగ్రామాలకు తీసుకొని వచ్చి చెరుస్తారని ఎంపిడిఓ డిజె వినిల్ కుమార్, వెలుగు ఏపిఎం పోలమ్మలు తెలిపారు. వీరికి భోజన సదుపాయం, త్రాగునీరు, టిఫిన్ వసతులు కూడా కల్పించామన్నారు.

## రైతులను తిప్పుకోవద్దు : తహశీల్దార్



బాలాయపల్లి, మే 2 ప్రభాతవార్త : తహశీల్దార్ కార్యాలయానికి వచ్చే రైతులను తిప్పుకోవద్దని తహశీల్దారు విజయలక్ష్మి అన్నారు. శుక్రవారం విఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. పనులపై వచ్చే రైతులకు, ప్రజలకు సర్టిఫికెట్స్ కొరకు వచ్చే వారికి ఈ పనులు అవుతాయో కాదో అని స్పష్టంగా చెప్పాలని తెలిపారు. పనులు కాకుంటే రీజన్ వెంటనే వారికి చెప్పాలన్నారు. నెలలు కాలం పనులు చేయకుండా ఉండవద్దన్నారు. అర్జీలు వచ్చిన వెంటనే వాటిని పరిష్కరించాలన్నారు. రామాపురం రేషన్ దుకాణంపై వెంకటసుబ్బయ్య డీలరుకు వినతి పత్రం అందజేశారు. సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

## బాలిక అదృశ్యం!

బాలాయపల్లి, మే 2 ప్రభాతవార్త : బాలాయపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని 14 సంవత్సరాల బాలిక అదృశ్య కేసు నమోదు అయ్యింది. బాలాయపల్లి మండలంలోని గొట్టికాడు గ్రామానికి చెందిన సిహెచ్ అర్చన అనే బాలిక 30వ తేది రాత్రి నుండి కనపడకపోవడంతో కుటుంబ సభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో విచారించగా ఎక్కడా ఆచూకి లభించకపోవడంతో, బాలిక తండ్రి శ్రీకాంత్ బాలాయపల్లి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. తల్లిదండ్రుల ఫిర్యాదుతో మిస్సింగ్ కేసు నమోదు చేసిన పోలీసులు బాలిక ఆచూకీ కోసం దర్యాప్తు చేస్తున్నారు. ఈ మేరకు బాలిక ఆచూకీ తెలిసిన వారు వెంకటగిరి సిఐ 9440796348, బాలాయపల్లి ఎస్ఐ 9440796350 నెంబర్లకు తెలియ జేయాలని బాలాయపల్లి ఎస్ఐ గోపి తెలిపారు.

## ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలి



కోట, మే 2 ప్రభాతవార్త: మండలం చంద్రశేఖర పురం గ్రామంలో శుక్రవారం ప్రకృతి వ్యవసాయంపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సిసి శ్రీకాంత్ మాట్లాడుతూ ఖరీఫ్ యాక్షన్ ప్లాన్ కోసం ఇంటింటికి వెళ్లి డేటా సేకరించారు. ప్రతి ఒక్కరు కనీసం 50 సెంట్లలో ప్రకృతి వ్యవసాయం చేయాలని కోరారు. పొలంలో ప్రతి రైతు నవ ధాన్యాలు వేసుకోవాలని చెప్పారు. ఇలా పంటలు వేసుకోవడం వలన తక్కువ కాలంలో తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది శ్రీనివాసులు, మండల ఇన్‌ఛార్జ్ పద్మ, విఒఎ మునెమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## గిరిజన బాలికల ప్రవేశాల కోసం దరఖాస్తులు

కోట, మే 2 ప్రభాతవార్త : 2025-26 విద్యా సంవత్సరానికి కోటలోని గిరిజన సంక్షేమ గురుకులంలో ఆంగ్ల మాధ్యమం, ప్రవేశాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తామని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ కె.రజనికుమారి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తరగతి నుంచి 6వ తరగతి వరకు గిరిజన బాలికలు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. తల్లిదండ్రులకు ఆదాయం ఏడాదికి లక్ష రూపాయలకు మించకూడదని చెప్పారు. దరఖాస్తులు ఎక్కువ వస్తే విద్యార్థులను లాటరీ పద్ధతిలో ఎంపిక చేస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు.

## బ్రహ్మోత్సవాల్లో స్థానిక కళాకారుల సందడి



తడ, మే 2 ప్రభాతవార్త : మండలం వాటంబేడులో జరుగుతున్న పంచపాండవ ద్రౌపతీ సమేత శ్రీ ధర్మరాజ స్వామి బ్రహ్మోత్సవాల్లో స్థానిక కళాకారులు సందడి చేస్తున్నారు. వాటంబేడు కుప్పానికే చెందిన పలువురు విచిత్ర వేషధారణలతో అలరిస్తున్నారు. వీధి భాగవతం ప్రదర్శిస్తు న్నారు. శుక్రవారం మహాభారతంలోని ప్రధాన పర్వాలలో ఒకటైన విరాట పర్వం పఠనం ఆసక్తిగా జరిగింది. ఈ ఘట్టంలో అర్జునుడు గోవులను మళ్లించడం ఒక ప్రధాన కార్యక్రమంగా భక్తులు ఆసక్తిగా తిలకించారు. తిక్కన రచించిన విరాట పర్వంలోని ఉత్తర గోగ్రహణం అర్జునుడి పరాక్రమానికి ఒక మచ్చుతునక. గోవులను తరలించుకుపోతున్న కౌరవులను ఎదుర్కొని విజయం సాధించి గోవులను మళ్లించడం, ఈ ప్రదర్శన పులికాట్ సరస్సు తీరంలో జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. వాటంబేడుకు చెందిన వందలాది గోవులను, వాటిని మళ్లించిన అర్జునుడు వేషధారి ఇటువంటి ప్రదర్శనను భక్తులు ఎక్కువ సంఖ్యలో తిలకించారు. రాత్రి చెన్నైకి చెందిన కళాకారులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

## పాకిస్థాన్‌ను ప్రోత్సహిస్తున్న కర్ణాటక సిఎం



గూడూరు, మే 2 ప్రభాతవార్త : పాకిస్థాన్‌ను కర్ణాటక సిఎం ప్రోత్స హిస్తున్నారని భారత్ వికాస్ పరిషత్ సౌతిండియా వైస్ ప్రెసిడెంట్ కంకణాల పెంచల నాయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన భారతదేశంలో కర్ణాటక రాష్ట్రంలో పాకిస్థాన్ జెండా తొక్కితే అరెస్టు చేస్తారని అన్నారు. అక్కడ ఉన్న సిఎం పాకిస్థాన్‌కు ఎందుకు సపోర్టు చేస్తున్నాడు. 26 మంది హిందువులను చంపారని, పెహల్గామ్‌లో జరిగిన ఈ దుర్ఘటనను ఎందుకు ఖండించలేదు అని ప్రశ్నించారు. ఎందుకు సంతాపం ప్రకటించలేదు అక్కడ ఉన్న ముస్లిం సోదరీమణులు నేల మీద ఉన్న పాకిస్థాన్ జెండాను తీసుకుని అక్కడ దుర్భాషలాడుతున్నారన్నారు. హిందువులు మనందరం కలిసికట్టుగా భారత్ మాతాకి జై అని నినాదాలు చేయాలని ఆయన కోరారు.

## మానవ సేవే మాధవ సేవ...అదే ఎస్‌సివి బాట



శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త : మానవసేవే మాధవ సేవ అదే ఆయన బాట. ఆయనే మాజీ శాసనసభ్యుడు ఎస్‌సివి నాయుడు.శ్రీకాళహస్తి నియోజకవర్గం తొట్టంబేడు మండలం తంగేళ్ళ పాళెం గ్రామానికి చెందిన ఆయన 1975 సంవత్సరం యువజన కాంగ్రెస్‌లో చేరారు. 1978లో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ చీలిపోగా ఆ ఎన్నికల్లో కాంగ్రెస్ ఐ అభ్యర్థిగా పోటీ చేసిన ఉన్న సుబ్రమణ్యం నాయుడుకు మద్దతుగా పని చేసి ఆయన గెలుపుకు కృషి చేసారు. ఆ ఎన్నికల్లో ప్రస్తుత ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు చంద్రగిరి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఐ అభ్యర్థిగా గెలవటంతో ఇద్దరి మధ్య స్నేహం కుదిరింది. 1983లో నందమూరి తారక రామారావు తెలుగుదేశం పార్టీ స్థాపించటంతో పార్టీలో చేరారు.తంగేళ్ళపాళెం సింగిల్ విండో అధ్యక్షుడుగా ,కేంద్ర సహకార బ్యాంకు డైరెక్టర్‌గా, తెలుగుదేశం జిల్లా కోశాధికారిగా ప్రత్యేకాహ్వానితుడుగా,సత్యవేడు నియోజకవర్గ ఇన్‌చార్జిగా వ్యవహరిం చారు. తెలుగుగంగ ద్వారా రైతులకు సాగునీరందించుటకు ఉద్యమాలను నడిపారు. అధికారంలో ఉన్నా రైతు పక్షాన పోరాడి గెలుపు సాధించారు. దాంతో ఒరైతాంగానికి దగ్గరయ్యారు.2004లో శాసన సభ్యుడుగా 13వేల ఓట్లతో గెలిచిన ఎస్‌సివి నాయుడు నియోజకవర్గంలో 1500కోట్లకు పైగా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేసారు. రాజీవ్‌నగర్ ఆయన రూపకల్పనే. తిరుపతిజిల్లాలోని శ్రీకాళహస్తి,తిరుపతి,సత్యవేడు నెల్లూరుజిల్లాలోని సూళూరుపేట, వెంకటగిరి ప్రాంతాల ప్రజలతో సత్సంబంధాలు కల్గి ఉన్నారు.ప్రభుత్వం పక్కాగృహాలను మంజూరు చేయగా నిరుపేదలకు మెటల్ ఇటుకలు,సిమెంటు,స్టీల్ అందించారు. రాజకీయాలకు అతీతంగా అందరికి తమ వంతు సహాయం చేస్తూ 'మానవ సేవే మాధవ సేవ'అనే నమ్మకంతో ప్రజల మనస్సుల్లో చిరస్థాయిగా నిలిచిన సేవా తత్పరుడు ఎస్‌సివి నాయుడు.ఓ వైపు సేవ,మరో వైపు ఆధ్యాత్మిక చింతనతో ముందుకు నడుస్తున్న ఆయనపట్ల జనాల్లో ఎనలేని అభిమానం.

## శ్రీకాళహస్తిలో శంకర జయంతి సంబరాలు



శ్రీకాళహస్తి,మే 2 ప్రభాతవార్త : జగద్గురు ఆదిశంకరాచార్యుల జయంతి ఉత్సవాలను సంబరంగా శుక్రవారం నిర్వహించారు.శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఈ సంబరాలను నిర్వహించారు. సంబరాల నిర్వహణకు ఆలయంలోని 16కాళ్ళ మండపం ఆవరణలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసారు. ఇక్కడ ఆదిశంకరా చార్యుల వారి చిత్రపటాన్ని ఏర్పాటు చేసారు. పూజలునిర్వహించారు. దీప,ధూప నైవేద్యాలను సమర్పించారు.ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమాలను ఇఓ డికె బాపిరెడ్డి ఆదేశాలతో ఎఇఓ విద్యాసాగర్‌రెడ్డి నిర్వహించారు. ఈ పూజలను ఆలయ ప్రధానార్చకులు కరుణాకర్ గురుకుల్ నిర్వహించారు. వేదపండితులు మారుతీశర్మ, శివప్రసాద్‌శర్మ, శ్రీనివాసశర్మ, గోవిందశర్మ, దక్షిణామూర్తిల వేద మంత్రాలను పఠిస్తుండగా అలయ పౌరోహితులు ఆర్ధగిరి పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ శ్రీకాళహస్తీశ్వరాలయానికి జగద్గురు ఆదిశంకరాచార్యుల వారికి శ్రీకాళహస్తితో ఎనలేని అనుబంధం ఉందన్నారు. ఆయన చాతుర్మాస వ్రతాన్ని ఇక్కడి బ్రహ్మగుడి ఆవరణలో నిర్వహించటం విశేషం అన్నారు. అంతేకాక జగద్గురు ఆదిశంకరాచార్యులు ఈ ఆలయాన్ని సందర్శించి నప్పటికే దాదాపు అన్ని ప్రతిష్టిత లింగాలుపూర్తి అయ్యాయి కాబట్టి చివరగా 'స్పటిక లింగాన్ని' ప్రతిష్టించినట్లు చారిత్రక ఆధారాలున్నాయని వివరించారు.ఈ కార్యక్రమాల్లో వారితో పాటు ఇఇ మురళీధర్‌రెడ్డి,టెంపుల్ సూపరింటెండెంట్ నాగభూషణం, టెంపుల్ ఇన్స్పెక్టర్ సుదర్శనం నాయుడులు పాల్గొన్నారు.

## కలపకు నిప్పు...భారీ అగ్నిప్రమాదం

### -బాధితుని పరామర్శించిన ఎంపి



శ్రీకాళహస్తిరూరల్,మే 2 ప్రభాతవార్త : మండలం ఇనగలూరు పంచాయతీలోని ఇనగలూరు గ్రామంలో చెలికం నాగరాజుకు సంబంధించిన కలప (టేకు) డంపింగ్‌కు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. దాంతో సుమారు రూ.10 లక్షల ఆస్తి నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఈ సమాచారం తెలుసుకున్న తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఇది ముమ్మాటికి ప్రతిపక్షాలు కక్ష సాధింపే అని ఆరోపించారు. చెలికం నాగరాజు రెడ్డి సర్పంచ్. పంచాయతీ సర్పంచ్‌గా వైకాపా తరఫున ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆయన వృత్తి రీత్యా కలప వ్యాపారం చేస్తుంటారు. గురువారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టినట్లు సమాచారం.సంఘటనా స్థలానికి తిరుపతి ఎంపి మద్దెల గురుమూర్తి, నియోజకవర్గ వైకాపా పర్యవేక్షకులు ఓడూరు గిరిరెడ్డి వైకాపా నాయకులు చేరుకున్నారు. ఈ ప్రమాదంలో విలువైన టేకు చెట్లు కాలిపోవటంతో నాగరాజుకు భారీ నష్టం వాటిల్లిందని ఆరోపించారు. ఇది ముమ్మాటికి గిట్టని వాళ్ళు చేసిన పనే అన్నారు. ఈ సంఘటనపై పోలీసులు సమగ్ర విచారణ జరిపిబాధితునికి న్యాయం చేయాలని ఎంపి డిమాండ్ చేసారు.

## నేటి నుంచి 9వ తేది వరకు... ఏపీపీఎస్సీ గ్రూపు-1 మెయిన్స్ రాత పరీక్ష

### -పరీక్షల నిర్వహణకు పగడ్బందీ ఏర్పాట్లు పూర్తి - జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు




తిరుపతి కలెక్టరేట్, మే 2 ప్రభాతవార్త : నేటి నుంచి 9వ తేది వరకు ఏపీపీఎస్సీ గ్రూపు -1 సర్వీసెస్ మెయిన్స్ రాత పరీక్ష నిర్వహణకు పగడ ఒందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి జి. నరసింహులు సంబంధిత ముఖ్య పర్యవేక్షణ అధికారులను, ఇన్విజిలేటర్‌లను ఆదేశించారు. శుక్రవారం ఉదయం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు డీఆర్వో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీలతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. నరసింహులు మాట్లాడుతూ తిరుపతి జిల్లాలో ఈ పరీక్షలకు మొత్తం మూడు సెంటర్లను ఏర్పాటు చేయడం జరిగిందని, 911 మంది అభ్యర్థులు హాజరు కానున్నారన్నారు. ముగ్గురు జిల్లా అధికారులుగా లైజన్ అధికారులుగా వ్యవహరిస్తారని తెలిపారు. రాత పరీక్ష ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్షలు జరుగుతాయని, పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు ఉదయం 8.30 గంల నుంచి 9.30 గంటల లోపు చేరుకోవాల్సి ఉంటుందని, అదనంగా గ్రేస్ పీరియడ్ 15 నిమిషాలు వరకు మాత్రమే అనుమతి ఉంటుందని, అభ్యర్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో చేరుకోవాలన్నారు. అభ్యర్థులకు పరీక్షా కేంద్రాల్లో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీపీఎస్సీ అసిస్టెంట్ సెక్రటరీ (మానిటర్)బి. వెంకటలక్ష్మి, సెక్షన్ ఆఫీసర్లు ఆర్.సునిత, శివన్నారాయణరెడ్డి, సంబంధిత జిల్లా స్థాయి అధికారులు, ముఖ్య పర్యవేక్షణ అధికారులు, ఇన్విజిలేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

పరీక్షా కేంద్రముల వివరాలు:
1. 7501-ఎస్.డీ.హెచ్.ఆర్ జూనియర్ కళాశాల, 23-3-196/18, సాగర్ హుండా షో రూమ్ ఎదురుగా, ఎస్.బి.ఐ బ్యాంకు ప్రక్కన, న్యూ బాలాజీ కాలనీ, ఎయిర్ బైపాస్ రోడ్డు, తిరుపతి, తిరుపతి జిల్లా. 2. 7502 -ఎస్వీయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ , ప్రకాశం భవన్, శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయం, ల్యాండ్ మార్క్, ఫిజికల్ ఎడ్యుకేషన్ విభాగం, తిరుపతి, తిరుపతి జిల్లా. 3. 7503-లిటిల్ ఏంజెల్స్ హైస్కూల్ , 18-1-90, 14/ఏ1, కేటీ రోడ్డు, ఎదురుగా, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు,యశోద నగర్, తిరుపతి. తిరుపతి జిల్లా.

## అమర ఆసుపత్రిలో రక్తదానం



రేణిగుంట, మే 2 ప్రభాతవార్త : అంతర్జాతీయ కార్మిక దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం రేణిగుంట మండలం అమర ఆసుపత్రి నందు ఇండో యంయంఐ కంపెనీ సహకారంతో అమర ఫౌండేషన్ బ్లడ్ బ్యాంక్ సెంటర్ నందు రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. కంపెనీకి చెందిన దాదాపు 50 మంది ఉద్యోగులు రక్తాన్ని దానం చేశారు. అమర ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి గౌరనేని మాట్లాడుతూ దానం చేసే ప్రతి రక్తపు బొట్టు మరొక నిండు ప్రాణాన్ని కాపాడుతుందన్నారు. రక్తదానాన్ని ఇవ్వడానికి యువత భయపడాల్సిన అవసరం లేదన్నారు. యువకులు ఎంత రక్తదానం చేస్తే అంత మంచిది అని తెలిపారు. ఇచ్చిన రక్తం కొన్ని గంటల్లో శరీరంలో ఉత్పత్తి అవుతుందన్నారు. రక్తదానం చేయడంవల్ల ఎన్నో రకాల జబ్బులు రాకుండా ఉంటాయన్నారు. కార్యక్రమంలో అమర ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ భాగ్యలక్ష్మి, ఇండో ఎంఐఎం దాసరి కిరణ్ కుమార్, రక్త దాతలు, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

## నేడు సర్వసభ్య సమావేశం

నాయుడుపేట,మే 2 ప్రభాతవార్త : మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి కురుగొండ ధనలక్ష్మి ఆధ్వర్యంలో శనివారం సర్వసభ్య సమావేశం నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ సురేష్‌బాబు తెలిపారు.ఈ సమావేశానికి మండలంలోని అన్నిశాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సర్వసభ్య సమావేశంలో ముఖ్యంగా తాగునీరు, వ్యవసాయం, ఉపాధిహామి, విద్య, వైద్యం, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణ, సిసిరోడ్ల నిర్మాణం, విద్యుత్,సాంఘిక సంక్షేమం, గృహనిర్మాణం, పశుసంవర్ధకశాఖ, అటవీశాఖ, ఎక్సైజ్‌శాఖలు వారిగా పూర్తిస్థాయిలో చర్చించి నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు.

## శిక్షణను బాలికలు సద్వినియోగం చేసుకోవాలి : సిడిపిఓ



గూడూరు, మే 2 ప్రభాతవార్త: యుక్త వయస్సు బాలికలు అందరూ ఈ నెల 2 వ తేదీ నుంచి వచ్చే నెల 10 వ తేది వరకు జరగనున్న కిశోర వికాసం శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సిడిపిఓ స్వరూపరాణి తెలిపారు. శుక్రవారం గూడూరు ప్రాజెక్టు పరిధిలో అంగన్వాడీ కేంద్రంలో కిశోర వికాసం శిక్షణ కార్యక్రమంను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ శిక్షణలో బాలికలకు విద్య, ఆరోగ్యం ఎంతో అవసరం అన్నారు. అందుకు బాలికల తల్లిదండ్రులు ప్రోత్సాహంతో పాటు సహకారం అవసరం అన్నారు. అనంతరం ఐసిడిఎస్ సూపర్వైజర్ శ్యామల మాట్లాడుతూ 18ఏళ్ళలోపు బాలికలు బాల్య వివాహాలకు దూరంగా వుండాలన్నారు. అలాగే ప్రతీ ఒక్కరూ ఫోక్సో చట్టం గురించి అవగాహన కలిగి వుండాలని తెలియజేశారు. ఐదు మంది కమిటీలతో శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్లు బి. హైమవతి, బి. చెంచులక్ష్మి, ఎంఎస్‌కెలు, ఏఎన్ఎంలు, ఎపిఎం బుజ్జమ్మ, బాలికల తల్లిదండ్రులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ప్రతిభా పురస్కారాలు






చిల్లకూరు, మే 2 ప్రభాతవార్త : మండలం తూర్పు కనుపూరు గ్రామం నందు శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఇంటర్మీడియట్‌లో ప్రతిభ కనబరిచిన 6 మంది విద్యార్థులకు నగదు బహుమతితో పాటు, సిద్ధారెడ్డి జనార్ధన్ రెడ్డి ప్రతిభ అవార్డులను ఇవ్వటం జరిగింది. అనంతరం వారు మాట్లాడుతూ సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి నిజ జీవితంలో ఎంతోమంది పేదలకు సహాయ సదాకారాలు అందించిన మహోన్నతమైన వ్యక్తి ఈరోజు మన మధ్య లేకపోవడం బాధాకరమన్నారు. ఆలయ అభివృద్ధితో పాటు నూతనంగా కనుపూరు గ్రామంలో శివాలయం ఏర్పాటు చేయడం అన్నారు. భర్త సిద్ధారెడ్డి జనార్ధన్‌రెడ్డి అడుగుజాడల్లో నడుచు కుంటూ ఆపదలో ఉన్న వారిని ఆదుకుంటూ ముందుకు వెళుతున్న ఆయన సతీమణి సిద్ధారెడ్డి ఇంద్రసేనారెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీ శ్రీ శ్రీ ముత్యాలమ్మ వారి దేవస్థానం మాజీ చైర్మన్ సిద్ధారెడ్డి ఇంద్రసేనారెడ్డి, సింహపురి రెడ్డి సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షులు సిద్ధారెడ్డి వెంకట సుధీర్ రెడ్డి, ప్రణతి, శ్రేష్ఠ చేతుల మీదుగా ఈ అవార్డులను ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కె.ధనంజయరెడ్డి, ఎరటపల్లి జానకిరామిరెడ్డి, చిల్లకూరు దశరథ రామిరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి, రెడ్డిసంఘం అధ్యక్షులు శ్రీకిరెడ్డి మధు సూదన్‌రెడ్డి, పేట వెంకట కృష్ణారెడ్డి, రెడ్డి సంఘం చిల్లకూరు మండల అధ్యక్షులు కొత్తపల్లి సనత్ కుమార్‌రెడ్డి, ప్రజేంద్రరెడ్డి, భాస్కర్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, సిద్ధారెడ్డి, బండి ధనంజయరెడ్డి, దశరధరామిరెడ్డి, సురేష్‌రెడ్డి, మూలి హరినాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, హరికృష్ణరెడ్డి, వై.కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## అడవిలో మంటలు అదుపులోకి



తిరుమల,మే 2 ప్రభాతవార్తప్రతినిధి: శేషాచలంకొండల్లో తిరుమల తుంబురు తీర్థం, పాపవినాశనమ్ అడవికి వ్యాపించిన మంటలు శుక్రవారం మధ్యాహ్నానికి అదుపుచేశారు. గురువారం అర్ధరాత్రి ఈ మంటలు కుమారధార, పసుపుధారప్రాజెక్టులున్న అటవీప్రాంతం వైపు మళ్ళాయి. విషయం తెలుసుకున్న టిటిడి డిఎఫ్ఓ వివేక్ అన్నమయ్యజిల్లా,చిత్తూరుజిల్లాలోని అటవీశాఖ, అగ్ని మాపక సిబ్బంది రెండువందలమంది వరకు తుంబురుతీర్థం, పాపవినాశనమ్ అడవిలోకి చేరుకున్నారు. పూర్తిగా పచ్చనిచెట్ల కొమ్మలు, ఈతమండలతో మంటలను అదుపుచేశారు.

## వేడుకగా భాష్యకార్ల ఊరేగింపు



తిరుమల,మే 2ప్రభాతవార్తప్రతినిధి: భగవద్ రామాను జులు జన్మించిన వైశాఖమాస ఆరుద్రనక్షత్రాన్ని పురస్కరిం చుకుని శుక్రవారం ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర వేడుకగా జరిగింది. సాయంత్రం శ్రీదేవిభూదేవిసమేత మలయప్పస్వామి ఒక తిరుచ్చిపై, భాష్యకార్లను మరో తిరుచ్చిపై ఆలయ మాఢవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు.

## ఉద్యోగులకు కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండ

### -తప్పుడు ఆరోపణలు మానుకోవాలని చంద్రశేఖరరెడ్డికి హితవు

### - ఇరిగేషన్‌శాఖ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు కుమార్‌స్వామి యాదవ్



చిత్తూరురూరల్, మే 2 ప్రభాతవార్త: గత వైకాపా ప్రభుత్వం ఉద్యోగులకు ఏదో మేలు చేసిందనీ. కూటమి ప్రభుత్వం అన్యాయం చేసిందంటూ రాష్ట్ర ఉద్యోగ, పెన్షనర్ల సంఘ అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి జిల్లా పర్యటనలో భాగంగా మాట్లాడడం విడ్డూరంగా వుందని ఉమ్మడి చిత్తూరు జిల్లా ఇరిగేషన్‌శాఖ ఎన్జీవో అసోసియేషన్ అధ్యక్షులు కుమార్‌స్వామి యాదవ్ పేర్కొన్నారు. గత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడురోజుల్లో సిపిఎస్‌ను రద్దు చేసి పాతపెన్షన్ విధానాన్ని పునరుద్దరిస్తామని ఇచ్చిన హామీ ఏమైందనీ ఐదేళ్లలోఎప్పుడైనా ప్రశ్నించారని అని దుయ్యబట్టారు. అలాగే ఉద్యోగుల కనీస హక్కులను కాలరాసిందని, పిఆర్సీ పిట్‌మెంట్ తగ్గించి ఇచ్చి, జిపిఎస్ రుణాలను నిలిపివేశారన్నారు. ఉద్యోగులకు ఒకటవ తేది జీతాలు ఎందుకు ఇవ్వాలంటూ మంత్రులు అవహేళన చేయడం ఎవరు మర్చిపోలేదని, కనీసం సమావేశాలు పెట్టాలనుకున్న పోలీసులతో ఎలా వేధించారో మీకు తెలియదా అని ప్రశ్నించారు. అక్రమ కేసులు పెట్టి, గృహనిర్బంధాలు చేసి నోటీసులు ఇచ్చి ఉద్యోగులకు వేదించినప్పుడు మీరు ఎందుకు ప్రశ్నించలేదన్నారు. రాష్ట్రంలో ఉద్యోగుల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కట్టుబడి వున్నారనీ, గత ప్రభుత్వం బకాయిలు చెల్లించకుండా వుంచిన సొమ్ములను ప్రస్తుత ప్రభుత్వం చెల్లిస్తోందనీ, ఉద్యోగుల జిపిఎఫ్ రుణాలు రూ. 650కోట్లు చెల్లించిన విషయం మర్చిపోయారా అని ప్రశ్నించారు. ఉద్యోగుల పట్ల ప్రేమ వున్నట్లు నటిస్తూ కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని చంద్రశేఖరరెడ్డికి కుమార్‌స్వామి హితవు పలికారు.

## కాలు విరిగిన ఉపాధి హామీ కార్మికురాలు



కెవిబిపురం, మే 2 ప్రభాతవార్త: ఉపాధి హామీ కార్మికురాలు గోతిలో పడడంతో కాలు విరిగిన సంఘటన కెవిబిపురం మండలం దిగువ పుత్తూరు గ్రామంలో శుక్రవారం జరిగింది. ఉపాధి హామీ పనుల్లో భాగంగా ట్రంచ్ కొట్టే పనుల్లో మణెమ్మ (50) జారి గోతిలో పడడంతో తుంటి వెముక విరిగిందని కూలీలు తెలిపారు. వెంటనే 108 వాహనానికి ఫోన్ చేయగా, పనుల దగ్గర నుంచి ఒక కిలోమీటర్ మంచంపై కూలీలు తీసుకుని వచ్చారు. ఏపిఓ భాస్కరయ్య చొరవతో మెరుగైన వైద్యం కోసం ఆమెను శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రికి తరలించి వైద్యం అందించారు.



తిరుపతిలోని కపిల తీర్థం ఆలయంలో శుక్రవారం ఆక్టోపస్ దళాలు మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. -ప్రభాతవార్త, తిరుపతి